

సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

శబరి.. బుకింగ్

హాట్‌కేక్‌ల్లా టిక్కెట్‌లు



- నవంబరు 22 వరకు బుకింగ్ క్లోజ్
- ఉదయం 8 గంటలకు టిక్కెట్ కౌంటర్ల వద్ద ఉన్నా ఫలితం శూన్యం
- ఆన్‌లైన్‌లోనూ కన్‌ఫర్మ్ కాని పరిస్థితి

బాపట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శబరి ఎక్స్‌ప్రెస్‌లో అన్ని తరగతుల టిక్కెట్‌లు హాట్ కేక్‌లు మాదిరిగా బుకింగ్ అయిపోతున్నాయి. రైల్వే శాఖ అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ (ఏ ఆర్‌పీ)ని 60 రోజులకు తగ్గించడంతో నవంబరు నెల 22వ తేదీ వరకు ఓపెన్ చేసిన అన్నీ తేదీలలో టిక్కెట్‌లు బుకింగ్ అయిపోయాయి. స్లీపర్ క్లాస్ మొదలుకొని ఫస్టు ఏసీ వరకు కూడా టిక్కెట్‌లు అందుబాటు లేవు. కనీసం వెయిటింగ్ లిస్టులోనైనా బుకింగ్ చేసుకోలేని విధంగా రిగ్రెట్ మెసేజ్ వచ్చేస్తోన్నది. టిక్కెట్ల కోసం చాలా మంది తెల్లవారు జామునే సమీపంలోని బుకింగ్ కౌంటర్ల వద్దకు వెళ్లి నిరీక్షిస్తున్నారు. ఆధార్ ప్రామాణీకరణ కలిగిన ఐఆర్‌సీటీసీ యూజర్లు మొబైల్ ఫోన్లు/కంప్యూటర్ల ముందు లాగిన్ అయి కూర్చుంటున్నా టిక్కెట్ బుకింగ్ కావడం లేదు. దీంతో శబరిమలకు ఎలా వెళ్లాలోనని మథన పడుతున్నారు. ఇక భారం అంతా స్పెషల్ ట్రైన్‌ల పైనే వేసి అయ్యప్ప మాలధారణల కు సిద్ధమౌతున్నారు.

ఏటా అక్టోబరు నెల నుంచి ఎక్కువ మంది అయ్యప్ప భక్తులు మాలధారణ చేస్తుంటారు. వీలుని బట్టి 45 రోజుల నుంచి 60 రోజుల పాటు దీక్ష (మిగతా 6వ పేజీలో)

ఆస్తిపన్నుపై.. కసరత్తు

20 శాతం ఆదాయం పెంపే లక్ష్యం

రూ.52 కోట్లు పెరగాలి..

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను ద్వారా వార్షిక ఆదాయం ప్రస్తుతం రూ.258.95 కోట్లుగా ఉంది. ఈ మొత్తంపై 20 శాతం పెంచుకోవాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ఈ ప్రకారం మున్సి పాల్టీల్లో ఆదాయం సుమారు రూ.52 కోట్లు పెరుగుతుందని అంచనా.

- గుంటూరు జిల్లాలో గుంటూరు కార్పొరేషన్ సహా జిల్లా పరిధిలోని మున్సిపాల్టీలలో ఆస్తి పన్ను వార్షిక ఆదాయం రూ.185.31 కోట్లు ఉంది. 20 శాతం పెరగాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు 37.06 కోట్లు ఆదాయం పెరిగే అవకాశం ఉంది.
- పల్నాడు జిల్లాలో ఆస్తి పన్ను ఆదాయం రూ 47.01 కోట్లు. రూ.9.40 కోట్లు పెరగాల్సి ఉంది.
- బాపట్ల జిల్లాలో ఆస్తి పన్ను 26.63 కోట్లు ఉండగా రూ.5.32 కోట్లు ఆదాయం పెరగాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది.

- పట్టణాల్లో రెండో విడత ఇంటింటి సర్వే
- మున్సిపాల్టీల్లో చేజారిన ఆదాయాలపై దృష్టి
- పన్నుపోటు లేకుండా ఆదాయం పెంపునకు లక్ష్యాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీల్లో పన్ను పెంచకుండా ఆదాయ వనరులను పొందేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న ఆస్తి పన్నుల ఆదాయం మరో 20 శాతం పెరిగాలని లక్ష్యం నిర్దేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఆదాయం పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై పురపాలకులు దృష్టి సారించారు. ఈ క్రమంలో చేజారిన పన్నులను తిరిగి రాబట్టుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆస్తి పన్నుల ఆదాయాన్ని పెంచుకునేందుకు సర్వే చేస్తున్నారు. తొలివిడత సర్వే సక్రమంగా జరగలేదని భావించిన డీఎంఏ మరో సారి ఆస్తి పన్ను సర్వేకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో రెండో సారి ఆస్తి పన్ను పునః పరిశీలనకు ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఈ సర్వేను వచ్చే 15 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడికక్కడ మున్సిపాల్టీల్లోని సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు మున్సిపల్ రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో సర్వే చేస్తున్నారు. సర్వే జరుగుతున్న తీరుపై డీఎంఏ వారాంతపు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

అక్రమాలకు చెక్ పడేనా..

మున్సిపాల్టీలకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తి పన్ను. ఈ పన్ను మదింపులో గతంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. పన్నులకు సంబంధించి గత టీడీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. భవనం.. ఖాళీ (మిగతా 6వ పేజీలో)



డీఎస్సీ సభకు ఏర్పాట్లు

- వెలగపూడిలో 25న నియామక పత్రాల పంపిణీ
- ఏర్పాట్లలో లోపం ఉండకూడదన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తుళ్లూరు(వెలగపూడి), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన వారికి ఈ నెల 25న నియామకపత్రాల పంపిణీ సభకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి రాష్ట్ర సచివాలయం వద్ద ఎన్- 9 రోడ్డు పక్కన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేయనున్నారు. వర్షాల నేపథ్యంలో 19న జరగాల్సిన కార్యక్రమం వాయిదా పడింది. అయితే 25న నిర్వహణకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మూడు భారీ జర్మన్ వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు, గుంటూరు కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రాకపోకల మార్గాలు, స్టేజి, బారీకేడింగ్ పనులతో పాటు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, బందోబస్తు ఏర్పాట్ల గురించి చర్చించారు. ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ సెక్రటరి కోన శశిధర్, డైరెక్టర్ విజయ్ రామరాజు, ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మకు సమ్మె నోటీసు అందజేస్తున్న వైద్యులు

25 నుంచి పీహెచ్‌సీ వైద్యుల సమ్మె

- అధికారులకు నోటీసు ఇచ్చిన ఏపీపీహెచ్‌సీడీఏ

బాపట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కాని పక్షంలో గురువారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఏపీపీహెచ్‌సీడీఏ రాష్ట్ర జాయింట్ సెక్రటరి డాక్టర్ గోపినాథ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మలకు సమ్మె నోటీసు అందజేశారు. ఇన్‌సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరణ, టైమ్‌బౌండ్ ఉద్యోగోన్నతులు అమలు, గిరిజన ప్రాంతాలలో పనిచేసే వారికి బేసిక్ పే 50శాతం, ట్రైబల్ అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ.5 వేల అలవెన్స్, నేటివిటి అండ్ అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నట్లు వారు ప్రకటించారు. పని గంటలు, స్థిరమైన వాతావరణపు సెలవులు కూడా ఇవ్వాలన్నారు. వైద్యుల జాబ్‌చార్టు ఇవ్వాలని, విషపూరితమైన పని వాతావరణాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీల్లో విచ్చలవిడిగా అనధికార వ్యక్తులు తనిఖీ చేయకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. తగినంత మంది స్టాఫ్‌నర్సులు లేకపోయినా తాము ఆరోగ్య కేంద్రాలను నిర్వహిస్తున్న కఠిన పరిస్థితులను ప్రభుత్వం గమనించాలన్నారు. వైద్యసేవలలో అంతరాయం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్‌సి వైద్యులు పాల్గొన్నారు.

మూడో ట్రాక్‌పై తనిఖీలు

నేడు, రేపు 160 కిమీ వేగంతో స్పీడ్ టెస్టు

- పరిశీలించి క్లియరెన్స్ ఇవ్వనున్న సీఆర్‌ఎస్ బృందం
- చుండూరు-పెదవడ్లపూడి సెక్షన్‌లో ఇన్‌స్పెక్షన్
- అప్పికట్ల - నిడుబ్రోలు మధ్య శాశ్వత డైవర్షన్ పనుల పరిశీలన

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చుండూరు - పెదవడ్లపూడి సెక్షన్‌లో రైల్వే శాఖ పూర్తి చేసిన మూడో రైలుమార్గాన్ని కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ(సీఆర్‌ఎస్) బుధ, గురువారంలో తనిఖీ చేయనున్నది. దాదాపు 160 కిలోమీటర్ల వేగంతో స్పీడ్ టెస్టు కూడా చేయనున్నది. మోటార్ ట్రాలీ ఇన్‌స్పెక్షన్ ద్వారా సీఆర్‌ఎస్ అధికారులు పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం రెండు రోజుల షెడ్యూల్‌ని దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ సంబంధిత రైల్వే అధికారులకు పంపించింది. ఇన్‌స్పెక్షన్‌కు ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా చూసుకోవాలని విజయవాడ డీఆర్‌ఎంని ఆదేశించారు. దీంతో పాటుగా అప్పికట్ల - నిడుబ్రోలు మధ్య శాశ్వత డైవర్షన్ పనులను కూడా సీఆర్‌ఎస్ ఇన్‌స్పెక్షన్ చేసి క్లియరెన్స్ ఇస్తారు. ఇందుకోసం సీఆర్‌ఎస్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రానుంది. సీఆర్‌ఎస్‌తో పాటు సిబ్బంది, ఆర్‌వీఎన్‌ఎల్ అధికారులు కూడా రానున్నారు. ఈ ఇన్‌స్పెక్షన్ కోసం ఐదు మోటార్ ట్రాలీలను వినియోగిస్తారు. ఈ ట్రాలీలను అప్పికట్ల, చుండూరులో అందుబాటులో ఉంచాల్సిందిగా హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదేశాలు జారీ చేశారు.

30 కిలోమీటర్ల ట్రాక్ సిద్ధం..

విజయవాడ-గూడూరు మధ్య మూడో రైలు నిర్మాణంలో భాగంగా బాపట్ల, గుంటూరు జిల్లా పరిధిలో చుండూరు - పెదవడ్లపూడి మధ్య 30 కిలోమీటర్ల సెక్షన్‌ని రైల్వే శాఖ నిర్మించింది. ఇటీవలే 100కు పైగా రైళ్లను బ్రేక్‌డౌన్ చేసి ప్రీఎన్ఐ, ఎన్ఐ వర్కులను కూడా పూర్తి చేసింది. దీంతో రైళ్లను నడిపేందుకు అవసరమైన క్లియరెన్స్‌ని ఇచ్చేందుకు సీఆర్‌ఎస్ బుధవారం ఉదయం విజయవాడకు చేరుకునున్నది. విజయవాడ డివిజన్ డీఆర్‌ఎంతో కలిసి ఉదయం 9 గంటలకు మోటారు ట్రాలీ ఇన్‌స్పెక్షన్‌ని అప్పికట్ల నుంచి చేపడతారు. ఇక్కడి నుంచి చుండూరు వరకు మోటార్ ట్రాలీని సాధారణ వేగంతోనే నడిపి పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల లోపు చుండూరు - తెనాలి మధ్య లైట్‌రన్ నిర్వహిస్తారు. భోజన విరామం అనంతరం తెనాలి నుంచి దుగ్గిరాల వరకు ఇన్‌స్పెక్షన్, లైట్ రన్ చేపడతారు. ఈ నెల 25న గురువారం ఉదయం దుగ్గిరాల నుంచి పెదవడ్లపూడి వరకు ఇన్‌స్పెక్షన్ జరుగుతుంది. ఆ తర్వాత పెదవడ్లపూడి నుంచి చుండూరు/అప్పికట్ల వరకు స్పీడ్ టెస్టు నిర్వహించనున్నారు.



విభాగాలను పరిశీలిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- పోలీసు కార్యాలయ తనిఖీలో ఎస్పీ ఆదేశాలు

బాపట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రత ఆహ్లాదకర వాతావరణంలో ఒత్తిడికి లోనుకాకుండా విధులు నిర్వహించగలమని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ జిల్లా పోలీసు ఉద్యోగులకు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ విభాగాలను ఎస్పీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. మెరుగైన పనితీరుకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతీఒక్కరు వారివారి విభాగాలను శుభ్రం చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ బాలమురళికృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, సీఐ శ్రీనివాసరావు, పీజీఆర్‌ఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఆర్ఐలు మౌలుద్దీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయంలో పెచ్చులు ఊడుతున్న పై కప్పు



శిథిలావస్థకు చేరిన గృహనిర్మాణ శాఖ కార్యాలయం

భయం భయంగా విధులు

- శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

బల్లికురవ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు ఎవరిపై శ్లాబు పెచ్చులు పడతాయోనని భయంభయంగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. విధుల అనంతరం క్షేమంగా ఇంటికి చేరితే చాలన్నట్లుగా ఉద్యోగులు ఉన్నారు. మండల కేంద్రమైన బల్లికురవలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ప్రభుత్వ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరాయి. భవనాల గోడలు సైతం సిమెంట్ ఊడి పడిపోతుంది. గోడలకు రంగులు వెలిసి అధ్వానంగా మారాయి. నిధులు ఉండి కూడా ఎంపీడీవో కార్యాలయానికి మరమ్మతులు చేయడంలేదని సమాచారం. గృహ నిర్మాణ, తహసీల్దారు కార్యాలయ భవనాలు పై కప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. ఆయా కార్యాలయా ల్లోని పరిస్థితులను చూసి సందర్శకులు సైతం భయపడుతున్నారు.

వరదపై అప్రమత్తంగా ఉండాలి

- నీటి విడుదలతో నదిలో పెరుగుతోన్న ఉధృతి
- ముంపు గ్రామాల పరిస్థితిపై కలెక్టర్ సమీక్ష.. పలు ఆదేశాలు

భట్టిప్రోలు(కొల్లూరు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలతో కృష్ణానదికి వరద వచ్చే సూచనలు ఉన్నాయని ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ తెలిపారు. రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని ముంపు గ్రామాల సర్పంచ్‌లు, అధికారులతో భట్టిప్రోలు ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. 2009లో వెంకట్రావునగర్ దగ్గర కరకట్టకు గండి పడి కుంగిందని, అక్కడ పటిష్ఠ పరచాలని భట్టిప్రోలు మండల పరిధిలోని పలువురు సర్పంచ్‌లు కలెక్టర్‌ను కోరారు. పెదపులివర్రు నుంచి దోనేపూడి వరకు కరకట్ట బలహీనంగా ఉందని అక్కడ ఎత్తు పెంచి, బలపరచాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు తెలిపారు. వరదల అనంతరం రహదారులు అధ్వానంగా మారుతున్నాయని, వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. 3 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తే దోనేపూడి వద్ద చినరేవుపై రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. వరదల సమయంలో తోకలవానిపాలెం, పోతార్లంక, కిష్కిందపాలెం, తిప్పలకట్ట గ్రామాల నుంచి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుందని హైలెవల్ వంతెన నిర్మించాలని తెలిపారు. ముంపు గ్రామాల్లోని సమస్యలపై సర్పంచ్ టి.కృష్ణమోహన్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. సమావేశం అనంతరం దోనేపూడి వద్ద చినరేవు చప్టాను కలెక్టర్ పరిశీలించారు. వెల్లటూరుతో పాటు ఇక్కడ కూడా ఫెర్రీ ఏర్పాటు చేయాలన్నారు. కొల్లూరు లాకుల వద్ద ఉన్న ఫెర్రీని కూడా కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొల్లూరు నుంచి సుమారు కిలోమీటరుకు పైగా పూర్తిగా దెబ్బతిన్న కరకట్ట గురించి తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వివరించగా ఆ మార్గాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్లు మేకా శ్రీనివాసరావు, మోర్ల శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.



కొల్లూరు వద్ద ఫెర్రీని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్



గుంటూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పనిచేయని ఆర్వో ప్లాంట్

మరమ్మతులు మరిచారు

కళాశాలల్లో అటకెక్కిన ఆర్వో ప్లాంట్లు

- నిర్వహణను పట్టించుకోని నిర్వాహకులు
- ప్రిన్సిపాళ్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని గుత్తేదారు
- సురక్షిత తాగునీరు అందక విద్యార్థులు అవస్థలు

చీరాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.లక్షలతో ఆర్వో ప్లాంట్లు నిర్మించారు. అయితే నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఆర్వో ప్లాంట్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. మరమ్మతులు గురించి నిర్వహణ సంస్థ పట్టించుకోక పోవడంతో పలు కళాశాల్లో ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. మరమ్మతుల గురించి గుత్తేదారు పట్టించుకోక పోవడంతో విద్యార్థులకు పరిశుభ్రమైన నీరు అందించడం కాగితాలకే పరిమితమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వం జూనియర్ కళాశాలలు 21 పైగా ఉండగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు నేడు పేరుతో ఒక్కో ఆర్వో ప్లాంట్లను రూ.3 లక్షలకుపైగా వ్యయం చేసి నిర్మించారు. పదివేల లీటర్లకు పైగా పరిశుభ్రమైన తాగునీరు అందించేలా వీటిని ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్లను ఐదేళ్ల పాటు గుత్తేదారు సంస్థ నిర్వహించాలి. అయితే ప్లాంట్లు ఏర్పాటు చేసి రెండున్నరేళ్లు కూడా కాలేదు. అయినా అనేక కళాశాలల్లో ఆర్వో ప్లాంట్లు పని చేయడం లేదు. కొన్నిచోట్ల వైరింగ్, ప్లంబింగ్ సమస్యలతో పాటు సాంకేతిక సమస్యలతో ప్లాంట్లు అటకెక్కాయి. సకాలంలో మరమ్మతు లు చేయాల్సిన కాంట్రాక్టు సంస్థ పట్టించు కోవడంలేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా సమస్యలపై ప్రిన్సిపాళ్లు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నా గుత్తేదారు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్లాంటు ఉన్నా పరిశుభ్రమైన తాగునీరు అందక విద్యా ర్థులు ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరులోని వృత్తి విద్య జూనియర్ కళాశాల, బాలి కల జూనియర్ కళాశాలలో ప్లాంట్లు మూడు నెలల నుంచి పనిచేయడం లేదు. ఇటీవల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కళాశాలకు వచ్చిన సమయంలో కూడా ప్లాంట్ల పరిస్థితి గురించి విద్యార్థులు, అధ్యాపకులు ఫిర్యాదులు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అనేక కళాశాలలో ఆర్వో ప్లాంట్లు పరిస్థితి ఇదే విధంగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయి. ప్లాంట్ల మరమ్మతుల గురించి ఉన్నతస్థాయిలో అధికారులు స్పందిం చాలని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.



ట్యాప్ ల వద్ద అపరిశుభ్ర వాతావరణం

హోరాహోరీగా జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్



చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈ పోటీలను ఆంధ్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి కే జగదీష్ పర్యవేక్షిస్తున్నారు. ఈ పోటీలను ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహిస్తోంది. చిన్న చిన్న సంచలనాలు మినహా, ఎక్కువ మంది అగ్ర క్రీడాకారులు మూడో రౌండ్‌లోకి సులభంగా అడుగుపెట్టారు. ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు లలిత్ బాబు, తమిళనాడుకు చెందిన అయుష్ రవికుమార్‌పై గెలుపొంది మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. వీరి మధ్య పోటీ ఆసక్తికరంగా జరిగింది.

26న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వారధి ఇండియా ఫౌండేషన్ స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న పరీక్షా భవన్లో ఈ నెల 26న జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ప్రధానోపాధ్యాయులు, మండల స్థాయి విజేతలను గైడ్ టీచర్ల సహాయంతో జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపాలని సూచించారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా (7842869407), అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రమ్య (98665 53230) తదితరులను సంప్రదించాలని సూచించారు.

శీతల గిడ్డంగుల్లో ఇంకా 60 లక్షల మిర్చి టిక్కీలు


- దసరా తర్వాత అమ్మకాలు, ధర పెరిగే అవకాశాలు
- ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరం చుట్టుపక్కల ఉన్న శీతల గిడ్డంగుల్లో ఇంకా 60 లక్షల మిర్చి టిక్కీలు నిల్వవున్నట్లు తాము వివరాలు సేకరించామని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఆంధ్రజ్యోతి సంచికలో మంగళవారం 'గుంటూరు మిర్చిపై దసరా ఎఫెక్ట్' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సెక్రెటరీ స్పందించారు. ప్రస్తుతం విపరీతమైన వర్షాలు కురుస్తుండటం, మిర్చిలో తేమ శాతం పెరగడం, రవాణా ఇబ్బందుల వలన బంగ్లాదేశ్‌కు ఎగుమతులు తగ్గాయన్నారు. ఈ ప్రభావం మిర్చి అమ్మకాలపై ఉందన్నారు. పండగ సెలవుల అనంతరం అమ్మకాలు, ధరలు పెరగొచ్చని ఎగుమతి, దిగుమతి వ్యాపారస్థులు తెలిపారని పేర్కొన్నారు. ఏటా దసరా నవరాత్రుల సందర్భంలో ఈ పరిస్థితి తలెత్తుందన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

- దిగువకు 3 లక్షల 97 వేల 250 క్యూసెక్కులు
- డెల్టా కాలువలకు 13 వేల 769 క్యూసెక్కులు

70 గేట్లు పూర్తిగా ఎత్తివేత



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరద నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి భారీగా పెరిగింది. ఎగువన వున్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 4 లక్షల 11 వేల 019 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుకుంది వరద ఉధృతి 4 లక్షల క్యూసెక్కులు దాటడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 3 లక్షల 97 వేల 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ రాజేష్ తెలిపారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 8242 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5527 క్యూసెక్కులు వదులు తుండగా, గుంటూరు ఛానల్ కాలువకు నీటి విడుదల నిలిపివేశారు. ప్రకాశం బ్యారేజికి వరద ఉధృతి భారీగా పెరుగుతుండడంతో దిగువ నదీతీర ప్రాంతాల వాసులు, లంకభూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

పులిచింతల సమాచారం

పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 37.50 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, 12 గేట్లను నాలుగు మీటర్ల మేర ఎత్తి 3,551,168 క్యూసెక్కుల నీరు, మొత్తం 3,68,168 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

పశ్చిమడెల్టాకు 5527 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 5527 క్యూసెక్కునీరు మంగళవారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజ్ వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 4,11,019 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 1513 క్యూసె క్కులనీరు, తూర్పుకాల్వకు 415 క్యూసెక్కులనీరు పశ్చిమకాల్వకు 237 క్యూసెక్కులనీరు, నిజాంపట్నంకాల్వకు 423 క్యూసెక్కులనీరు, కొమ్మ మూరుకాల్వకు 2140 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

విద్యుదుత్పత్తి నిలిపి వేత

రెంటచింతల,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 3,26,146 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కే వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, గిరిబాబులు చెప్పారు. ప్రాజెక్టుకు వున్న 20 గేట్లకు 14 క్రస్ట్ గేట్లను 4 మీటర్లు, 2 గేట్లను 3.5 మీర ఎత్తామన్నారు.ఎగువన వున్న సాగర్ నుంచి 3,26,838 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వస్తుందన్నారు.ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.63 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.4880 టీఎంసీలకు సమానమన్నారు.

దిగువకు 3,97,250 క్యూసెక్కుల వరద నీరు విడుదల

మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

కొల్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 3,97,250 క్యూసెక్కుల వరద నీరు విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు 3.84 లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయగా ఎగువ నుంచి వరద ఉధృతి ఎక్కువ కావడంతో ఆరున్నర సమయంలో 3,97,250 క్యూసెక్కులు దిగువకు విడుదల చేయడంతో పాటు తూర్పు, పశ్చిమ ప్రధాన కాల్వలకు కూడా మరో 13,769 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వరద మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. 5.67 లక్షల క్యూసెక్కుల వరద నీరుకు మించితే రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.



దోనేపూడి వద్ద చప్టాపై పారుతున్న వరద నీరు

ఏఎన్‌యూలో స్మార్ట్ ఇండియా అంతర్గత హ్యాకథాన్



హ్యాకథాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం "స్మార్ట్ ఇండియా అంతర్గత హ్యాకథాన్ 2025"ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గంగాధర రావు మాట్లాడుతూ యువత తమలోని ప్రతిభను, పారిశ్రామిక ఆలోచనలను ప్రదర్శించేందుకు ఈ వేదిక ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వీరయ్య, సమన్వయకర్త సూర్యకామేశ్వరి, ప్యానల్ సభ్యులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ జి.నీలిమతో పాటు అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీ పీజీసెట్‌లో 9,892 సీట్లు భర్తీ

2025-26 విద్యా సంవత్సరానికిగానూ మొదటి కౌన్సెలింగ్‌లో భాగంగా అభ్యర్థులకు పీజీ ప్రవేశాలు (ఏపీ పీజీసెట్-2025) కేటాయించినట్లు వీసీ ప్రవేశాల కన్వీనర్ ఆచార్య రవికుమార్ మంగళవారం తెలిపారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు 11,401 మంది అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. వెబ్ ఆప్షన్ అనంతరం 9,892 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులు ఈ నెల 27లోపు వారికి కేటాయించిన కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియ ర్యాంకులు ఆధారంగా పారదర్శకంగా జరిగిందని ఆయన తెలిపారు. ప్రత్యేక క్యాటగిరీల ప్రవేశాలు, మొదటి దశ కౌన్సిలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి రెండోదఫా కౌన్సెలింగ్‌ను త్వరలో నిర్వహిస్తామని కన్వీనర్ ఆచార్య రవికుమార్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడు ఝున్నుసాహెబ్‌కు నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు



యడ్లపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అందమైన చేతిరాతకు ప్రాణం పోస్తూ.. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయుడు ఝున్నుసాహెబ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఒకే నెలలో మూడు అవార్డులను కైవసం చేసుకుని జిల్లాలోనే హ్యాట్రిక్ అవార్డు గ్రహీతగా నిలిచారు. మండలంలోని కొండవీడు పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఝున్నుసాహెబ్ విద్యార్థులలో చేతిరాత నైపుణ్యాలను పెంపొందించడంలో విశేష కృషిచేస్తున్నారు. కేవలం తమ పాఠశాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా అందంగా రాయడం(కాలిగ్రఫీ)లో శిక్షణ ఇస్తూ తన సేవాభావాన్ని చాటుకుంటున్నారు. ప్రతిసారీ ఆయా పాఠశాలలకు వెళ్ళి శిక్షణ ఇవ్వడం సాధ్యం కానందున విద్యార్థులతో పాటు అక్కడి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలలకు సెలవుదినాల్లో వెళ్లి ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ నెలలో వరుసగా మూడు అవార్డులు వరించాయి.సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆయనను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది. ఈ నెల 7న విశాఖపట్నంకు చెందిన సెయింట్ మదర్‌థెరెస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఏటా అందించే గురు బ్రహ్మ అవార్డును ప్రదానం చేసింది. తాజాగా హైదరాబాద్‌కు చెందిన శారదా ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతిష్టాత్మకంగా అందించే నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్-2025 అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 25న హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు. వినూత్న బోధనా పద్ధతులతో విద్యాబోధన, వర్క్‌షాపులు నిర్వహిస్తూ విద్యా సేవలు అందిస్తున్న ఝున్నుసాహెబ్‌కు వరుసగా అవార్డులు లభించడం పట్ల సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

శబరి..బుకింగ్

(5వ పేజీ తరువాయి)

చేసి ఇరుముడులతో అయ్యప్పస్వామిని దర్శించుకొనేందుకు బయలుదేరు తుంటారు. దాదాపుగా ఒక రోజంతా ప్రయాణ సమయం ఉండటంతో ఎక్కువ మంది రైళ్లలోనే వెళ్లేందుకు ప్రాధాన్యం కనబరుస్తుంటారు. అయితే గుంటూరు మీదగా శబరిమలకు వెళ్లే ఒకే ఒక్క రైలు శబరి ఎక్స్‌ప్రెస్. ఇది సికింద్రాబాద్‌లో బయలుదేరి ఉమ్మడి గుంటూరు జిల్లాలో నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుం టూరు, తెనాలి, నిడుబ్రోలు, బాపట్ల మీదుగా ప్రయాణిస్తుంది. ప్రస్తుతం నం బరు. 17230గా ఉన్న సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29వ తేదీ నుంచి నంబరు. 20629 సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌గా మారబోతు న్నది. ఈ కారణంగా టైంటేబుల్‌ని కూడా మార్పు చేశారు. 28వ తేదీ వరకు ప్ర స్తుత కాలమానపట్టికలోనే ప్రయాణిస్తుంది. 29వ తేదీ నుంచి మాత్రం సికింద్రా బాద్‌లో మధ్యాహ్నం 2.25కి బయలుదేరి సాయంత్రం 4.59కి నడికుడి, 5.19కి పిడుగురాళ్ల, 5.49కి సత్తెనపల్లి, 6.35కి గుంటూరు, రాత్రి 7.33కి తెనాలి, 7.53కి నిడుబ్రోలు, 8.13కి బాపట్ల, 8.28కి చీరాల, మరుసటి రోజు మధ్యాహ్నం 2.12కి కొట్టాయం, 2.55కి చెంగనూరు, సాయంత్రం 6.20కి తిరువనంతపురం చేరుకొంటుంది.

అయ్యప్ప భక్తులు ఇరుముడులు కట్టించుకొని మధ్యాహ్నం భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకొని ఈ రైలులో బయలుదేరే విధంగా టైంటేబుల్ ఉండ టంతో ఇందులో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. విజయవాడ మీద గా శబరిమలకు వెళ్లే రైళ్లు ఉన్నప్పటికీ అవి దూర ప్రాంతాల నుంచి వచ్చేవి. ప్రస్తుతం తత్కాల్ కోటా టిక్కెట్‌లు ఎలాగైతే హాట్‌కేక్‌లు మాదిరిగా బుకింగ్ అయిపోతాయో శబరి ఎక్స్‌ప్రెస్‌కి ఏ రోజుకు ఆ రోజు ఉదయం 8 గంటలకు బు కింగ్ ఇలా తెరవగానే అలా అయిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రద్దీ రోజులను బట్టి టీవోడీ(ట్రైన్ ఆన్ డిమాండ్)లను శబరిమలకు నడపాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఆస్తి పన్నుపై.. కసరత్తు

(5వ పేజీ తరువాయి)

స్థలం కొలతలను ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే పన్ను ఎంతో తెలుస్తుంది. ఈ విధానంలో అక్రమాలు జరగవని భావించినా కొన్ని మున్సిపాలిటీల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి తప్పుడు కొలతలు నమోదు చేశారు. దీంతో పన్ను తక్కువగా నమోదైందని కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. నివాస భవనాన్ని వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగించడం, పన్ను విధించిన సమయంలో ఒక అంతస్తు ఉన్న భవనంపై కట్టడాలు కూడా ఉన్నాయి. పైగా గత వైసీపీ ప్రభుత్వంలో అధికార పలుకుబడితో పలువురు పన్నులను తగ్గించుకున్నారు. ఇలాంటి అక్రమాలపై దృష్టి సారించాలని పురపాలకులను డీఎంఏ ఆదేశించింది. దీంతో ఆ లోపాలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు. అన్ అసైన్డ్.. అండర్ అసైన్డ్ భవనాలను కూడా గుర్తిస్తున్నారు.

తిరుపతి ఎక్స్‌ప్రెస్ తాత్కాలికంగా ధర్మవరం వరకు పొడిగింపు

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు - తిరుపతి - గుంటూరు మధ్యన ప్రయాణించే ఎక్స్‌ప్రెస్ రైలుని వచ్చే నెల నుంచి ధర్మవరం వరకు పొడిగిస్తూ రైల్వే శాఖ నిర్ణయించింది. అక్టోబరు 1వ తేదీ నుంచి నంబరు. 17261 గుంటూరు - ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌గా మారుతుంది. ఈ రైలు తిరుపతికి చేరుకొన్న తర్వాత పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లె, ములకలచెరువు, కదిరి మీదగా ఉదయం 9 గంటలకు ధర్మవరం చేరుకొంటుంది. అక్టోబరు 2వ తేదీ నుంచి నంబరు. 17262 ధర్మవరం - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌గా మారుతుంది. ఈ రైలు మధ్యాహ్నం 1.20కి బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై తిరుపతికి రాత్రి 7.15కి చేరుకొని 7.25కి బయలుదేరుతుంది. ప్రస్తుతం వలే మరుసటి రోజు ఉదయం 7.20కి గుంటూరు చేరుతుంది. ఈ మార్పు నవంబరు 30వ తేదీ వరకు అమలులో ఉంటుంది.

ప్రపంచ తెలుగు మహాసభలకు

గోవా గవర్నర్‌కు ఆహ్వానం



గోవా గవర్నర్ అశోక్‌గజపతి రాజుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గజల్ శ్రీనివాస్, రామచంద్రరాజు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యం లో వచ్చే ఏడాది జనవరి 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గుంటూరులో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహా సభల ఆహ్వాన పత్రికను గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతి రాజుకు పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, సమన్వయకర్త పీ రామచంద్రరాజులు అందజేశారు. జనవరి 5వ తేదీన ఉదయం 10 గంటలకు మహాసభలలో భాగంగా జరిగే ఆంధ్ర వైభవం సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి తెలుగు సాహితీ, సాంస్కృతిక, సేవా రంగ ప్రముఖులకు ఆంధ్ర శ్రీ, ఆంధ్ర సారస్వత భూషణ, ఆంధ్ర సారస్వ త రత్న పురస్కారాలను అందజేసి తెలుగు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించాలని గవర్నర్‌ను కోరారు. ఈ సందర్భంగా గవర్నర్ సానుకూలంగా స్పందించారని గజల్ శ్రీనివాస్ తెలిపారు.

బీఫార్మసీ పరీక్షలను పరిశీలించిన సమన్వయకర్త సుబ్బారావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న బీ-ఫార్మసీ (రెగ్యులర్, సప్లిమెంటరీ) పరీక్షలను మంగళవారం పీజీ, వృత్తివిద్య కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు పరిశీలించారు. విశ్వవిద్యాలయం క్యాంపస్ ఫార్మసీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించి పరీక్షలు జరిగే తీరును చూశారు. ఆయన విద్యార్థుల హాల్ టికెట్లు, జవాబుపత్రాలు తదితర వాటిని పరిశీలించారు. అలాగే పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని ఆయన పరీక్షా కేంద్రం నిర్వహకులకు సూచించారు.

హత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

మంగళగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి కొత్తపేటలో సుమారు ఏడేళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా మూడో ఏడీజే కోర్టు న్యాయమూర్తి సీ వెంకట నాగశ్రీనివాసరావు తీర్పు చెప్పారు. మంగళగిరి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎర్రబాలెం గ్రామానికి చెందిన బొద్దులూరి వెంకట రమణ (43), కొత్తపేటకు చెందిన మోటుకూరి భాస్కరరావులు 2019, ఫిబ్రవరి 8వ తేదీన రాత్రి పదిన్నర గంటల సమయంలో ఎర్రబాలెంలో మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. అనంతరం ఎవరి ఇంటికి వారు వెళ్లిపోగా, అర్ధరాత్రి రమణ కొత్తపేటలోని భాస్కరరావు నివాసానికి వెళ్లి మరోమారు గొడవకు దిగాడు. దీంతో కోపోద్రిక్తుడైన భాస్కరరావు ఇంట్లోని కుట్టుమిషన్‌పై వున్న కత్తెరతో రమణను పొట్టలో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన రమణ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి సీఐ సీహెచ్ రవిబాబు నిందితుడు భాస్కరరావును అరెస్టు చేసి న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో జిల్లా మూడో ఏడీజే కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముబీనా బేగం వాదనలు వినిపించగా, న్యాయమూర్తి వెంకట నాగశ్రీనివాసరావు ముద్దాయి భాస్కరరావుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పినట్టు మంగళగిరి పట్టణ పోలీసులు తెలిపారు.

స్కూటీ అదుపుతప్పి ఒకరి మృతి

చేబ్రోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్కూటీ అదుపుతప్పి రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద మంగళవారం జరిగింది. ప్రముఖ ధార్మికవేత్త తబ్లిగ్ జమాత్ పొన్నూరు మండలం అమీర్(ఇన్‌ఛార్జి)గా వ్యవహరిస్తున్న మగ్బుల్ జానీ(74) భార్య షంషాద్ బేగంతో కలిసి స్కూటీపై వెళుతుండగా నారాకోడూరు సమీపంలో స్కూటీ వెనుక టైర్ బరస్ట్ కావడంతో అదుపుతప్పి రోడ్డుప్రమాదానికి గురయ్యారు. షంషాద్ బేగంకు స్వల్పగాయలుకాగా, తీవ్రంగా గాయపడిన మగ్బుల్ జానీని స్థానికులు వడ్లమూడిలోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకువెళ్ళగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

పసుపు రైతులకు వ్యాపారి టోకరా

రూ. 3 కోట్ల వరకు సరుకు కొని పత్తా లేకుండా పోయిన వ్యాపారి

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పసుపు రైతులకు వ్యాపారి టోకరా వేశాడు. సుమారు మూడు కోట్ల రూపాయల వరకు సరుకులు కొని పత్తా లేకుండా పోయాడని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. హుబ్లీలో ఉండే ఒక వ్యాపారి రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన బ్రోకర్ ద్వారా సత్తెనపల్లి మండలం అబ్బూరు, లక్కరాజు గార్లపాడు, రాజుపాలెం మండలం గణపవరం, వినుకొండ, ఫిరంగిపురం మండలాల్లోని పలు గ్రామాల్లో గత ఏడాది ఏప్రిల్‌లో సుమారు 15 మంది రైతుల వద్ద నుంచి పసుపును కొనుగోలు చేశారు. కొనుగోలు అనంతరం కొద్ది రోజుల్లోనే నగదు చెల్లిస్తానని బ్రోకర్ ద్వారా రైతులను మభ్య పెట్టాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎప్పుడు ఫోన్ చేసిన సమాధానం దాట వేస్తున్నాడని, గట్టిగా నిలదీసే సరికి రెండు నెలలుగా వ్యాపారి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడని బాధిత రైతులు వాపోయారు. బ్రోకర్‌ను అడిగినా ఏ సమాధానం చెప్పకుండా మిన్నకుండి పోతున్నాడన్నారు. దీంతో రైతులు చేసేది లేక పోలీసులను ఆశ్రయించారు. ఎవరెవరు ఎంత పసుపు అమ్మింది, ఎంత మొత్తం రావాలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను వారు వేడుకున్నారు. ఐతే ఈ విషయాన్ని పోలీసులు మాత్రం ధృవీకరించటం లేదు. బాధిత రైతులు ఇంకా ఎక్కువ మొత్తంలో ఉండే అవకాశం ఉందని రైతులు చెపుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

30,716 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 32,349 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 30,716 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,794 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14300	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13800	334	10500	14500
273	----	----	నెంబరు. 5	10000	14000
341	10000	14800	273	----	----
4884	----	----	341	10000	15000
సూపర్ 10	----	----	4884	10000	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14600	తేజ	10000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15000
బ్యాడిగి	10000	15000	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7000

నేడు వేమూరులో మెగా వైద్య శిబిరం

వేమూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆదేశాల మేరకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకంలో భాగంగా బుధవారం వేమూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా పర్వీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు అనేక రకాలైన రక్త పరీక్షలను, స్కానింగ్ తీస్తామని ఆమె చెప్పారు. ఉచిత వైద్య సేవలతో పాటు మందులను కూడా పంపిణీ చేస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిర సేవలను నియోజకవర్గ పరిధిలోని గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ జరీనా పర్వీన్ కోరారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు: ఎస్పీ

బాపట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ, వ్యక్తులను కించపరుస్తూ సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెట్టిన ఇద్దరిని అద్దంకి, వేమూరు పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇతరులను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకు అద్దంకి స్టేషన్‌లో నమోదైన కేసులో గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన కళ్ళం హరికృష్ణారెడ్డి, ఫోటోలు మార్ఫింగ్ చేసి అసభ్యకర పోస్టులు పెట్టినందుకు వేమూరు పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో అనంతపురం జిల్లా బెలిగిపురం మండలం నక్కపల్లి గ్రామానికి చెందిన ఉస్తిలి సంజీవరెడ్డిని పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఒకేషన్ ట్రేడ్స్ ద్వారా పరిజ్ఞానం పెంపొందించుకోవాలి: ఏవో

చుండూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు ఒకేషన్ ట్రేడ్స్ ద్వారా అదనపు పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఏవో ఆదాంబాబు అన్నారు. మంగళవారం చుండూరులో వరి భూముల్లో యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అగ్రికల్చర్ వొకేషనల్ ట్రేడ్ ఇంటర్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఒకేషన్ ట్రైనర్ పులివర్తి జాన్‌వెస్లీ వ్యవసాయ శాఖలో వివిధ ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్ ఉపాధి అవకాశాలు వివరించారు. హెచ్‌ఎం కుర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ, నానాటికి పెరుగుతున్న పోటీతత్వాన్ని గుర్తించుకొని వివిధ శాఖలపై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు.

వలివేరులో చండీహోమం

చుండూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వలివేరులో 10వ శతాబ్దం నాటి శ్రీలలితా స్వయంభువేశ్వరి దేవాలయంలో మంగళవారం నుంచి 8రోజుల పాటు చండీ హోమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సుగంధ పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. వివిధ గ్రామా ల నుంచి వచ్చిన భక్తులు హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. చినపరిమి, మోదుకూరు అమ్మవారి దేవాలయాల్లో అర్చకులు శాస్త్రోక్తంగా నవమి పూజలు నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా...

● కర్లపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో ఆదాయ వనరుల పెంపుదలకు కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లకు రెండు రోజులపాటు జరగనున్న అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రజినీ తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐ డి.ప్రభుదాను సిబ్బందితో కలిసి మంగళవారం నరసాయపాలెం గ్రామంలో దాడులు నిర్వహించారు. మాదకద్రవ్యాలు వినియోగించినా, బెల్టుషాపులు నిర్వహించినా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

● బాపట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు చెల్లించి పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బాపట్ల ఎన్జీవో హోమ్‌లో నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

● బాపట్ల రూరల్: బాపట్ల మండలం వెదుళ్ళపల్లిలో మంగళవారం ఈగల్ టీమ్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రజలలో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ వినియోగానికి ఎవరయినా బానసయిన.. లేదా సమీపంలో అలాంటి వారు ఎవరయినా తారసపడినా వెంటే టోల్‌ఫ్రీ నంబరు 1972కు తెలియపర్చాలని అధికారులు తెలిపారు.

● బాపట్లరూరల్: బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మశీ ఎన్‌సీసీ క్యాడెట్ పక్వాడ్ -2025 క్లీన్‌నెస్ డ్రైవ్‌లో పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టిఇజికె.మూర్తి తెలిపారు. 22వ ఆంధ్రా బెటాలియన్ పరిధిలోని బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ నుంచి సుమారు 60మంది ఎన్‌సీసీ క్యాడేట్‌లు బాపట్ల ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో కీన్‌నెస్ డ్రైవ్ నిర్వహించారని తెలిపారు.

● బాపట్ల: పట్టణంలోని 9వ వార్డు మూర్తి రక్షణ్ నగర్ సమీపంలో కమల్ నగర్‌కు చెందిన తాడిబోయిన రాఘవరావు స్థలం ఫెన్సింగ్ తొలగించి దౌర్జన్యం చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. సత్తార్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పవన్‌కుమార్, కర్పూరపు శ్రీనివాసరావు తనపై దౌర్జన్యం చేశారని రాఘవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

● బాపట్ల: పట్టణంలోని కొత్తబస్టాండ్ కూడలిలో యాదవపాలెంకు చెందిన రిటైర్డ్ ఏఎస్ఐ నల్లిబోయిన వెంకటేశ్వరరావుపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. అదే ప్రాంతానికి చెందిన రావుల వెంకట్రావు, శ్రీనివాసరావు తనపై దౌర్జన్యం చేయటమే కాకుండా కొట్టారంటూ వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

ఘనంగా దసరా మహోత్సవాలు


అబ్బనగూడవల్లి శివాలయంలో, కర్లపాలెం శ్రీరామకృష్ణ సేవాసమితిలో, కర్లపాలెం శ్రీవాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గాయత్రిదేవిగా, చావలి వాలేశ్వరాలయంలో సర్వమంగళ పార్వతి అవతారంలో అమ్మవార్లు

వేమూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీ దేవి శరన్నవ రాత్రుల ఉత్సవాలలో భాగంగా రెండో రోజు మంగళవారం అమ్మవారికి విశేషంగా మంగళగౌరీ పూజలు నిర్వహించారు. జంపని రామేశ్వరాలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా, అబ్బనగూడవల్లి ఆలయంలో గాయత్రిదేవిమాతగా, చావలి వాలేశ్వరాలయంలో సర్వమంగళ పార్వతిగా అమ్మవారిని అలంకరించారు. చావలి గోగులమ్మ ఆలయంలో సామూహిక పూజలు జరిపించారు. 8 దిక్కుల రామ మందిరాలలో విశేష పూజలు జరిపారు.

● కర్లపాలెం: నవరాత్రుల్లో రెండోరోజు సత్యవతిపేటలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని బాలత్రిపురసుందరి దేవిగా, రామకృష్ణసేవాసమితి, ఆర్యవైశ్యకళ్యాణ మండపం, శ్రీపెద్దింటమ్మతల్లిదేవాలయం, శ్రీకాళీకమ్మ తల్లి దేవాలయంలో గాయత్రిదేవి అవతరాలను కన్నుల పండుగగా ఏర్పాటు చేశారు.

● రేపల్లె: దసరా మహోత్సవం రెండో రోజు నియోజకవర్గంలో అమ్మవారికి కుంకుమపూజ, ప్రదోషకాల పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో గాయత్రి దేవి, మంగళగౌరీగా భక్తులకు దుర్గమ్మ దర్శనమిచ్చింది. రేపల్లెలోని ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయం, రైలుపేట అభయాంజనేయస్వామి దేవాలయంలో అమ్మవారికి కుంకుమపూజ, లలితా సహస్ర నామం తదితర పూజలు నిర్వహించారు.

● చెరుకుపల్లి: దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గుళ్ళపల్లి శ్రీగంగాభిసమేత స్వామి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ శాశ్వతధర్మకర్త పొన్నపల్లిసత్యనారాయణ, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● అమృతలూరు: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో దేవీశరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో రెండోరోజు పార్వతీ అమ్మవారు శ్రీగాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శినమిచ్చారు. అమృతలూరులో శ్రీ అమృతేశ్వరస్వామి ఆలయంలోనూ, శరణువారి రామమందిరం వద్ద ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

● బాపట్ల: బాపట్లలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దేవీ నవరాత్రుల రెండో రోజు అమ్మవారు శ్రీగాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యలంకరోడ్డులోని కోనప్రభాకరరావు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలలో అమ్మవారికి కుంకుమార్చన, సామూహిక శ్రీ లలిత సహస్రనామపారాయణం గావించారు.

● పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలోని శ్రీభగళాముకి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రుల రెండోరోజు అమ్మవారికి ఆఖండ పూజలు నిర్వహించారు. శ్రీభగళాముఖి అమ్మవారిని మాంగళ్య గౌరిదేవిగా అలంకణగావించారు. ఈ కార్యక్రమాలను ఆలయ సీనియర్ సహాయకులు నాగుల శ్రీనివాసరావు, కొండవీటి శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

● పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీలింగోద్భవస్వామివారి దేవస్థానంలో దేవీ నవరాత్రుల మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా మంగళవారం శ్రీలింగోద్భవస్వామి దేవస్థానంలో శ్రీ పార్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. అలాగే మండలంలోని ఖాజీపాలెంలో శ్రీకాశీవిశ్వనాధస్వామి దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రులలో భాగంగా రెండో రోజు శ్రీఅన్నపూర్ణాదేవిఅమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించారు.

● బాపట్ల: శ్రీదేవిశరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీగాయత్రిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండో రోజు అమ్మవారు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రం భట్టిప్రోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు మహేశ్వరిదేవిగా, పార్వతీ దేవస్థాన ఆలయంలో వైష్ణవి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొల్లూరు మండలంలోని కోటిపల్లి సోమశేఖరస్వామి ఆలయంలో సత్యజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు గాయత్రిదేవిగా, కొల్లూరులో పార్వతీదేవి దేవస్థానంలో బాల త్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


కొల్లూరులో మహేశ్వరిదేవి అలంకారంలో వాసవి అమ్మవారు, శ్రీలింగోద్భవస్వామివారి దేవస్థానంలో శ్రీపార్వతి అమ్మవారు

కావూరు కళాశాలలో వృక్షాల నరికివేత పై మంత్రి అనగాని ఆదేశాలు బేఖాతర్..!


కావూరు రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ ఆవరణలో నరికించిన వృక్షాలు

రేపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంత్రి అనగాని ఆదేశాలను మండల అధికారులు బేఖాతరు చేశారు. చెరుకుపల్లి మండలం కావూరు రెసిడెన్షియల్ కళాశాలతో పాటు పాఠశాల ఆవరణలో 20 సంవత్సరాల కిందట నాటిన మొక్కలను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఈ నెల 17న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఇష్టానుసారంగా నరికించి.. వాటిని కృష్ణాజిల్లా అవనిగడ్డ వారికి రూ. లక్షలకు అమ్ముకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయాన్ని స్థానికులు తెలుసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీని గురించి మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో).. మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఈ విషయంపై వెంటనే విచారించి తగు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆయన ఆదేశించి వారం రోజులు గడుస్తున్నా ఇంతవరకు అధికారులు విచారణ జరిపిన దాఖలాలు లేవు. పచ్చటి చెట్లను కొట్టివేసి రూ. లక్షలు దోచుకున్నవారిపై చర్యలు తీసుకోకపోవటం ఏమిటంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టిసారించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు: కలెక్టర్ వినోద్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీ నాటికి కృష్ణానది రెండో ప్రమాద సూచిక దాటే అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయన రేపల్లె డివిజన్ అధికారులతో కృష్ణానది వరద గురించి సమీక్షించారు. ప్రజలు ఏమైనా అత్యవసరమయితే కంట్రోల్ రూమ్ నంబర్లు బాపట్ల కలెక్టరేట్-9177530308, కొల్లూరు-7794894544, భట్టిప్రోలు-8179886300, రేపల్లె-9505322959, రెవెన్యూ డివిజన్ 08648-293795కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు.

స్వచ్ఛ భారత్‌లో బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలి: కలెక్టర్

స్వచ్ఛభారత్‌లో బాపట్ల జిల్లా మొదటి స్థానంలో ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. అన్ని ప్రభుత్వశాఖల అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని చెప్పారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి స్వచ్ఛభారత్, స్వచ్ఛతాహీ సేవ, ఈ కేవైసి, తల్లికి వందనం, మనమిత్ర, సచివాలయ సేవలు, డోర్ టూ డోర్ చెత్త సేకరణ వంటి అంశాలపై జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మునిసిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలతో కలెక్టర్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు వారు చేసిన పనికి సంబంధించిన రిపోర్టును ఇవ్వాలన్నారు.

ప్రజలకు అందుబాటులో యూరియా

జిల్లాలో 171.600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అవసరమైన రైతులు తీసుకోవచ్చని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా 289.205 మెట్రిక్ టన్నుల యూరియాను 2,385 మంది రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇంకా 171.600 మెట్రిక్‌టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకుల వినతి

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్‌కు సీపీఎం నాయకులు వినతి పత్రం అందించారు. మంగళవారం వరద విపత్తుపై ముంపు ప్రాంతాల పరిశీలనతో పాటు సమీక్ష సమావేశానికి విచ్చేసిన కలెక్టర్‌ను సీపీఎం నాయకులు కలుసుకొని భట్టిప్రోలు మండలంలోని సమస్యలను విన్నవించారు. ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆసుపత్రిగా మార్చడంతో పాటు ఎక్స్‌రే, స్కానింగ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే చావలి మీదుగా తెనాలి వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి ఆక్రమణలను తొలగించి రోడ్డు వెడల్పు చేయాలని విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణమోహన్, సత్యనారాయణ, సుధాకర్, జి.నాగరాజు, మనోజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బ్లాక్ బర్లీ సాగుచేస్తే కేసులు నమోదు చేయండి

● టెలీ కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ రాష్ట్ర కమిషనర్ ఢిల్లీరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్ తదితరులు

బాపట్ల, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌బర్లీ పొగాకు సాగు చేసినా, దానికి సంబంధించిన విత్తనాలను సరఫరా చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని వ్యవసాయశాఖ రాష్ట్రకమిషనర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్‌లు, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులతో మంగళవారం ఆయన అమరావతి నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు సమర్ధవంతంగా పని చేయాలన్నారు. వీక్షణ సమావేశంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, వ్యవసాయశాఖాధికారి అన్నపూర్ణ, మార్క్‌ఫెడ్ జీఎమ్ కరుణశ్రీ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

కొల్లూరు/ భట్టిప్రోలు సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల కోసం 13 పునరావాస కేంద్రాలను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. కొల్లూరులో 8, అనంతవరం, చిలుమూరు, ఈపూరు, దోనేపూడి గ్రామాల్లో ఒక్కోటి అలాగే భట్టిప్రోలు మండలం వెల్లటూరులో ఒక్కొక్క పునరావాస కేంద్రం ఏర్పాటుకు తహసీల్దార్లు బి.వెంకటేశ్వర్లు, ఎం.శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వరద బాధితులకు అవసరమైన సౌకర్యాలను పరిశీలించారు. కృష్ణానదిలో వరద ప్రవాహం పెరగతున్న నేపథ్యంలో పునరావాస కేంద్రాలను పరిశీలన చేసినట్లు అధికారులు తెలిపారు.

నేడు దోనేపూడి పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం


కొల్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దోనేపూడి పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం జరుగుతుందని అధ్యక్షుడు వెనిగళ్ల మహేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా విచ్చేస్తారని చెప్పారు. ఆయన చేతుల మీదుగా రూ.1.50 కోట్లు సీసీ రుణాలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యూరియా కోసం ఆందోళన వద్దు: ఏవో

చుండూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏవో రైతులకు సూచించారు. చుండూరులో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో మాట్లాడారు. ఇప్పటికే తగినంత యూరియాను గ్రోమోర్, పీఏసీ కేంద్రాల ద్వారా పంపిణీ చేశామని, రానున్న రోజుల్లో మరింత యూరియాను సరఫరా చేస్తామని చెప్పారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చందోలు ప్రాథమిక వైద్యాధికారి చంద్రిక


వైద్య సేవలందిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చంద్రిక, వైద్యసిబ్బంది

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంతెనవారిపాలెం ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రంలో మంగళవారం చందోలు ప్రాథమిక వైద్యాధికారిణి ఎన్.చంద్రిక ఆధ్వర్యంలో స్వస్థసశక్త్ నారి అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోగులకు వైద్యులు వివిధ రకాల వైద్యపరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రిక మాట్లాడుతూ, ఇలాంటి ఉచిత వైద్య సేవలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ లక్కంరాజు ఆదిలక్ష్మీ వెంకటపతిరాజు, గ్రామపంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ఎ.ప్రసాదరావు, హెల్త్ రూట్ ఆఫీసర్ కె.నాగేశ్వరరావు, వైద్యులు షారోనురాణి, ఏఎన్‌ఎమ్‌లు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

చెరుకుపల్లి మండలంలో...

చెరుకుపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుళ్ళపల్లి నూకాలమ్మ దేవస్థానం కల్యాణమండపంలో మంగళవారం స్వస్త్‌నారీ స్వస్త్‌పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించి మహిళలకు ప్రత్యేక వైద్యసేవలు అందించారు. రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. రక్తహీనత, అసంక్రమిత వ్యాధుల నివారణ, పోషకాహారం తదితర అంశాలపై వైద్యులు డాక్టర్ సమద్, షాలెహజబెర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంగర శ్రీనివాస చక్రవర్తి, కాటూరి నాగేశ్వరరావు, షాజాద్, కావూరు పీహెచ్‌సీ పరిధిలోని వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


మహిళలకు చికిత్స అందిస్తున్న కావూరు పీహెచ్‌సీ సిబ్బంది

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌కు ఎమ్మెల్యే అభినందనలు


బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్‌కు అభినందనలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కె.బుచ్చిరాంప్రసాద్‌ను మంగళవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. గొల్లపూడిలోని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సంఘ భవనంలో చైర్మన్‌ను ఎమ్మెల్యే కలుసుకున్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనాలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

90 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పేద ప్రజలు వైద్యం చేయించుకోలేని వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 90 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను అందించారు. సీఎం సహాయ నిధి కోసం మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా రూ.44,84,000లను మంజూరు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొర్రా సురేంద్ర, గుర్రం మురహరిరావు, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన మహిళ కుటుంబసభ్యులకు అప్పగింత

కొల్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన మహిళను కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు. మండల పరిధిలోని ఈపూరు గ్రామంలో సోమవారం రాత్రి ఓ గుర్తు తెలియని మహిళ ఒంటరిగా సంచరించడం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ అమరవర్ధన్ గ్రామానికి చేరుకుని మహిళను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఆమెతో మాట్లాడి కుటుంబ వివరాలు సేకరించారు. ఆమెకు మతిస్థిమితం సరిగా ఉండదని తెలుసుకున్నారు. వెంటనే ఆమె కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. తెనాలి జేఎంజే స్వధార్ హోంలో మహిళను ఉంచారు. మంగళవారం ఆమె భర్త సిలార్‌కు అప్పగించారు.

ఎంపీడీవోగా శేఖర్‌బాబు బాధ్యతల స్వీకరణ

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవోగా)గా సి.హెచ్ శేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వేమూరు మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఆయన ఇక్కడకు వచ్చారు. నూతన ఎంపీడీవోకు సచివాలయ ఉద్యోగులు, గ్రామపంచాయతీల కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం మండలంలోని 14 గ్రామపంచాయతీలకు చెందిన కార్యదర్శులు, 12 గ్రామ సచివాలయాల ఉద్యోగులకు పీ4పై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులకు ఎంపీడీవో శేఖర్‌బాబు పీ4, పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎ.ఏలీషాబాబు, గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

నేడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని శేఖర్‌బాబు తెలిపారు. ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరవుతారని ఆయన తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ విధిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలి

● జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ విజయమ్మ

బాపట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విధిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ సూచించారు. మండలంలోని చెరువు జమ్ములపాలెంలో మంగళవారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డీఎంహెచ్‌వో సందర్శించి, పంపిణీ చేస్తున్న మందులను పరిశీలించారు. కార్యక్రమంలో నరసాయపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్, జిల్లెళ్ళమూడి ఆయుష్, వైద్యులు డాక్టర్ భువనేశ్వరి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మరియమ్మ, రవి, ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.లక్ష్మీపార్వతి, సూపర్‌వైజర్ త్రివేణి, సర్పంచ్ బోయిన వెంకటేశ్వరమ్మ, కార్యదర్శి మరియమ్మ, సిబ్బంది రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాల రైతులకు సంక్షేమ పథకాలు: మేనేజర్ రామకృష్ణ

వేమూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాల రైతులకు డెయిరీ ద్వారా ప్రయోజనకరమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు సంగం డెయిరీ బీఎంసీ మేనేజర్ రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం కుచ్చెళ్లపాడు గ్రామంలో గ్రామ యూనిట్ ద్వారా పాలను సరఫరా చేసే 83 మంది రైతులకు రూ.1,94,000ల బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తాడికొండ పాండురంగారావు, సూపర్‌వైజర్ ఎ.వెంకటేశ్వరరావు, తాడికొండ కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలి


● అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి

వేమూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోషకాహార పదార్థాలపై అందరికీ అవగాహన ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కుచ్చెళ్లపాడులో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా మహిళలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బొమ్మల తయారీ, పోషకాహార పదార్థాల వంటల ప్రదర్శన ఏర్పాటు చేశారు. చిరుధాన్యాలు వాడకం పెంచుకోవాలని సూచించారు. ఏయే పదార్థాలలో పోషక విలువలు ఎంతవరకు ఉంటాయన్న విషయాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనసూయ, వెంకాయమ్మ, గర్భవతులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

ఆకుముడత తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి: ఏవో

వేమూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిలక దశలో ఉన్న వరి పైరుకు ఆకుముడత తెగులు సోకినట్లు గుర్తించామని, దాని నివారణకు శాస్త్రవేత్తలు సూచించిన విధంగా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్ సూచించారు. మంగళవారం మండలంలోని పెరవలి, పెరవలిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రాలను సందర్శించిన పొలాల్లో ఆకుముడత తెగులు నివారణకు క్లోరంట్రా నిలిప్రోలు ఎకరాకు 60 గ్రాములు, ఫ్లూబెండాసిడ్ 20 గ్రాములు చొప్పున పైరుకు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏలు కళ్యాణి, డీవీ సుబ్బారావు, ఎంపీఈవో నరేశ్, రైతులు పాల్గొన్నారు.


నరసరావుపేట : శృంగేరి శంకరమఠంలో శ్రీ శారదాంబ అమ్మవారికి కౌమారి అలంకారం


పెదకాకాని : గాయత్రీ దేవి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు


అమరావతి : బాలాత్రిపురసుందరీ దేవిగా బాలచాముండికా అమ్మవారు

వైభవంగా దసరా ఉత్సవాలు

అమరావతి/నరసరావుపేట/పెదకాకాని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లోని దేవాలయాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలి వచ్చి అమ్మవారి ప్రత్యేక అలంకారాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా రెండో రోజు బాలచాముండికా సమేత అమరావతి అమరేశ్వరాలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. ఆలయ మొదటి ప్రాకారంలో ఉన్న జ్వాలాముఖి అమ్మవారిని కూడా పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని భ్రమరాంబ అమ్మవారు గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో దసరా ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. నరసరావుపేటలోని శృంగేరి శంకరమఠంలో శ్రీ శారదాంబ అమ్మవారికి కౌమారి అలంకారం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలు పట్టణాలు, గ్రామాల్లో దేవీ మండపాలను ఏర్పాటు చేసి దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

దీక్షతో.. పాఠం

- చదివి వినేలా యాప్ రూపకల్పన
- పుస్తకాలపై క్యూఆర్ కోడ్ స్కాన్‌తో అవకాశం

సత్తెనపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠం బోధించినా కొంతమంది విద్యార్థులకు అర్థం కాదు. టీచర్ అడగాలంటే భయం.. సందేహాలు నివృత్తి చేసుకోవాలంటే బిడియం. పాఠాలు సక్రమంగా విన్నప్పటికీ భయం.. బిడియంతో తెలివైన విద్యార్థులు కూడా పరీక్షల్లో వెనుకబడి పోతున్నారు. దీంతో తరగతి గదిలో ఉపాధ్యాయుడి బోధించినట్లుగానే ఇళ్ల వద్ద విద్యార్థులు పాఠం వినేలా.. అర్థం చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం దీక్ష పేరుతో ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా మరోసారి పాఠాలు విని.. చదివి సులువుగా అర్థం చేసుకునే అవకాశం విద్యార్థులకు వచ్చింది. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఫోన్‌లో దీక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పాఠ్య పుస్తకంపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కావాల్సిన పాఠ్యాంశాలు సవివరంగా కన్పిస్తాయి. ఎన్‌సీఆర్‌టీతో పాటు రాష్ట్ర సిలబస్ పాఠాలు ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. దివ్యాంగులకు ఆడియో పాఠాలతో పాటు పది వేలకు పైగా డిక్షనరీ పదాలు ఉన్నాయి.



క్యూఆర్ కోడ్‌తో ఉన్న పుస్తకాలు

ఎన్నో ప్రయోజనాలు

1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని రకాల పాఠ్య పుస్తకాలపై క్యూఆర్ కోడ్‌ను ప్రచురించింది. దీక్ష యాప్ దాని ద్వారా ఆయా పాఠ్యాంశాలను విద్యార్థులు పూర్తిగా చదువుకుని తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా యాప్‌ను రూపకల్పన చేశారు. యాప్ ద్వారా అభ్యసించడం వల్ల విద్యార్థుల్లో అవగాహన సామర్థ్యం పెరుగుతుంది.

-శ్రీనివాసరావు, ఎంఈవో సత్తెనపల్లి

క్రీడలకు ఉజ్వల భవిషత్తు : మంత్రి రాంప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ఏఎన్‌యూ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి ఎం రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో 36వ దక్షిణ మండల జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలు, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల విధానంలో నూతన అధ్యాయం ప్రారంభమైందన్నారు. ఆధునిక సాంకేతికతను క్రీడల రంగానికి జోడించుట ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చు అన్నారు. ప్రభుత్వానికి సమాంతరంగా పలు అథ్లెటిక్ అసోసియేషన్లు, మల్టీ నేషనల్ కంపెనీలు క్రీడలను ప్రోత్సహించడం సంతోషకరమని తెలిపారు. తొలుత అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పతాకాన్ని మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఏపీ అథ్లెటిక్ అసోసియేషన్ పతాకాన్ని శాప్ ఛైర్మన్ రవినాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ భరణి ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, లక్షద్వీప్, పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ల పరిమితి పెంచాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి

చిలకలూరిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో నల్లబర్లీ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించారు. జిల్లాలో రైతులు మొత్తం 11 వేల టన్నుల పొగాకును పండించారని ప్రభుత్వ అంచనాగా ఉన్నట్టు ఆయన చెప్పారు. జిల్లాలో రైతుల వద్ద నుంచి తొలుత 1,600 టన్నులు, తర్వాత రైతుల ఒత్తిడితో మరో 500 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని, ఇప్పటివరకు కేవలం 2,100 టన్నులు పొగాకును మాత్రమే కొనుగోలు చేసినట్టు తెలిపారు. నెలలు గడుస్తున్నా 20 క్వింటాళ్లు పైబడి పొగాకును పండించిన రైతుల వద్ద నుంచి పొగాకును కొనుగోలు చేయలేదని, కొనుగోళ్ల స్లిప్పులు కూడా ఇవ్వలేదని ఆయన వివరించారు. జిల్లా పరిధిలో కనీసం మరో 2 వేల టన్నుల పొగాకును కొంటే తప్ప రైతులకు ఉపశమనం కలగదని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిబంధనలు సడలించి తక్షణమే పొగాకు కొనుగోళ్లు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై గతంలోనే తాము రైతుల పక్షాన మార్క్ ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించడం జరిగిందన్నారు. తమకు పరిమితికి మించి కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు లేవని, పరిమితి పెంపు ఉత్తర్వులు లేవని అధికారులు చెప్పినట్టు ప్రత్తిపాటి సభద్వారా ప్రభుత్వానికి తెలియచేశారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

రిటైనింగ్‌వాల్‌కు.. టెండర్లు


రక్షణగోడ లేకపోవడంతో వరదలకు ముంపునకు గురవుతున్న తాడేపల్లి మహానాడు ప్రాంతం (ఫైల్)

వర్షాలు.. వరదలతో.. కృష్ణమ్మ ఎక్కడ తమను ముంచేస్తుందోనని కరకట్ట ప్రాంతవాసులు రాత్రి పగలు అన్న తేడా లేకుండా భయంభయంగా గడుపుతుంటారు. వరద వస్తే రోజుల తరబడి ఇళ్లను వదిలేసి సురక్షిత ప్రాంతాలకు తరలి పోతుంటారు. ఇక ఇలాంటి భయాలు.. కష్టాలు వీడేలా కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ దిగువున కుడి కరకట్టకు రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులకు మోక్షం కలిగింది. మూడున్నర దశాబ్దాల నుంచి తాడేపల్లి మహానాడు ఏరియా వాసుల వరదముంపు సమస్యకు విముక్తి లభించేలా మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారాన్ని చూపారు. సీతానగరం రైల్వేవంతెన నుంచి కనకదుర్గా వారధి వరకు సుమారు 1.7 కిలోమీటర్ల పొడవున నదీతీరం వెంబడి కాంక్రీట్ రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి రూ.245.18 కోట్లతో జలవనరులశాఖ టెండర్లను ఆహ్వానించింది. కాంట్రాక్టు సంస్థలు వచ్చే నెల 6న ఉదయం పది గంటలలోగా బిడ్లు దాఖలు చేసుకోవచ్చని జలవనరుల శాఖ తెలిపింది. అక్టోబరు చివరికి కాంట్రాక్టు సంస్థకు వర్క్ ఆర్డర్ లభించవచ్చు. నవంబరు లేదా డిసెంబరులో పనులు మొదలై 2027 చివరికి పూర్తయ్యే అవకాశం ఉంది.

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి) కృష్ణానదికి వరదలు వస్తే ప్రకాశం బ్యారేజి దిగువన కరకట్ట వెంబడి పేదల నివాసాలు ముంపునకు గురికావడం పరిపాటిగా మారింది. ఈ సమస్య నుంచి విజయవాడ వైపున్న ప్రాంతాలు కొద్దికాలం కిందటే విముక్తి చెందాయి. అయితే ఇటు గుంటూరుజిల్లా వైపు కుడికట్ట వైపున్న తాడేపల్లి మహానాడు ప్రాంతవాసుల కష్టాలు మాత్రం తీరలేదు. గతేడాది నదికి గరిష్ఠస్థాయిలో 11.45 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినప్పటికీ విజయవాడ వైపున్న పేదల నివాసాలకు రక్షణగోడ ఏర్పాటు కారణంగా ఎలాంటి సమస్య రాలేదు. కానీ ఇటువైపు తీరంలో ఉన్న మహానాడు మాత్రం వరదముంపునకు గురై వారం రోజులకు పైగా పేదలు ఇబ్బంది పడ్డారు. ఈ పరిస్థితిని స్వయంగా గమనించిన మంత్రి లోకేశ్ రక్షణగోడను నిర్మించాలని గత ఏడాది సెప్టెంబరులో నిర్ణయించారు. నిర్ణయం తీసుకున్న వెంటనే కార్యాచరణ చేపట్టారు. దీంతో జలవనరుల శాఖ రూ.294.20 కోట్ల అంచనాలతో రూపొందించిన ప్రతిపాదనలను జనవరిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదింపజేసి దానికి సంబంధించిన పరిపాలన అనుమతులకు లోకేశ్ గ్రీన్‌సిగ్నల్‌ను ఇప్పించారు.



పేదల గోడు పట్టించుకోని వైసీపీ

2019-24 మధ్య అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వ హయాంలోనే తాడేపల్లి మహానాడు వైపు కృష్ణాతీరం వెంబడి రిటైనింగ్‌వాల్‌ను నిర్మించాలనే డిమాండ్లు బలంగా వచ్చాయి. విజయవాడ వైపు రక్షణగోడ నిర్మాణం చేపడుతున్నట్లే తమవైపు కూడ ఆ పనులను జరిపించి తమను రక్షించాలని మహానాడు, సుందరయ్యకట్టవాసులు కోరారు. అయితే వీరిగోడును పట్టించుకోలేదు.


విజయవాడ బాలాజీనగర్ వైపు గతంలో నిర్మించిన కృష్ణానది ఎడమవైపు రక్షణగోడ

రోడ్డును వదిలేయడంతో తగ్గిన వ్యయం

బ్యారేజి దిగువన కుడిమార్జిన్ వెంబడి 0.9 కిలోమీటర్ల నుంచి అంటే సీతానగరం రైల్వేవంతెనల నుంచి 2.61కిలోమీటర్ల వరకు అంటే వారధి వరకు సుమారు 1.71కిలోమీటర్ల పొడవున కాంక్రీట్ రిటైనింగ్‌వాల్‌ను నిర్మించేందుకు జలవనరులశాఖ రూ.245.18 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. అయితే మంత్రిమండలి రూ.294.20 కోట్లకు పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ఫైనల్ టెండరుకు వచ్చేప్పటికి అంచనా వ్యయం రూ.245.18 కోట్లుగా జలవనరులశాఖ తేల్చింది. తొలుత విజయవాడ బాలాజీనగర్ వైపు నిర్మించిన విధంగా రివర్ ఫ్రంట్ పార్కుతో కూడిన రిటైనింగ్‌వాల్ తోపాటు ఆ పక్కనే 60 అడుగుల సిమెంటు రోడ్డును నిర్మించాలని ప్రతిపాదించారు. కానీ సదరు సిమెంటు రోడ్డు నిర్మాణం వల్ల భవిష్యత్తులో రిటైనింగ్‌వాల్ బలహీనమవుతుందన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని వదిలేసి కేవలం రిటైనింగ్‌వాల్, రివర్ ఫ్రంట్ పార్కును మాత్రమే చేపట్టాలని నిర్ణయించారు. దీంతో అంచనా వ్యయం రూ.294.20 కోట్ల నుంచి రూ.245.18 కోట్లకు తగ్గింది.

..బాహుబలి గోడ

రిటైనింగ్‌వాల్ అంటే సాదాసీదా కాంక్రీట్‌వాల్ కాదు. 2.2 మీటర్ల వెడల్పుతో బలిష్ఠంగా నిర్మించనున్నారు. నదికి 12 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చినా చెక్కు చెదరకుండా బలంగా నిలిచి ఉండేలా అత్యంత బలిష్ఠంగా నిర్మిస్తారు. రిటైనింగ్ వాల్ ప్రకాశం అనకట్టతో సమానంగా వరదపోటును సమర్థంగా ఎదుర్కొనేలా నిర్మించనున్నారు.

వైసీపీ హయాంలో 28 శాతమే పూర్తి

- కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 52 శాతం పూర్తి చేశాం
- పిడుగురాళ్ల మెడికల్ కాలేజీపై అసెంబ్లీలో ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ నిర్మాణం విషయం లో వైసీపీ అసత్య, గ్లోబల్ ప్రచారం చేస్తుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీల నిర్మాణ అంశంపై మంగళవారం శాసన సభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వం పిడుగురాళ్ల మెడికల్ కాలేజీని కేవలం 28 శాతమే పూర్తి చేసిందని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావటానికి కొద్ది రోజుల ముందు పనులు పూర్తి కాని మెడికల్ కాలేజీని ప్రారంభించేందుకు శిలాఫలకం ఏర్పాటు చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో 52 శాతం పనులు పూర్తి చేయించామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం కేవలం కేంద్రం నుంచి వచ్చిన నిధులను మాత్రమే మెడికల్ కాలేజీల నిర్మాణానికి వినియోగించారు తప్ప, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వెచ్చించిన దాఖలాలు లేవని అన్నారు. ప్రభుత్వం త్వరితగతిన మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తి చేస్తే పల్నాడు ప్రాంత ప్రజల వైద్య అవసరాలు చాలా వరకు తీరతాయని అన్నారు. గురజాల నియోజకవర్గం కొన్ని మండ లాల్లో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. గురజాల ఆసుపత్రిలో గైనకాలజిస్టు పోస్టు ఖాళీగా ఉందని, దాన్ని వెంటనే భర్తీ చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అసెంబ్లీ లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

వృద్ధులకు.. వరం

- ప్రయోజనకరంగా సీనియర్ సిటిజన్ కార్డులు
- ప్రచార లోపంతో అందుకోలేక పోతున్న వృద్ధులు


వినుకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సులువుగా పొందేలా.. వృద్ధాశ్రమంలో సేవలు అందుకునేలా.. వృద్ధులకు వరంలా.. రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్ కార్డులను ప్రవేశపెట్టింది. అనేకరకాల ప్రయోజనాలు ఉన్న కార్డులను గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా జారీ చేస్తున్నారు. అయితే ప్రచార లోపం వల్ల వృద్ధులకు ఈ కార్డుల గురించి తెలియడం లేదు.

కార్డు ఇలా పొందవచ్చు...

పురుషులకు 60, మహిళలకు 58 ఏళ్లు నిండితే సీనియర్ సిటిజన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసిన వారికి వారంలో కార్డు మంజూరవుతుంది. జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో వెంటనే పొందవచ్చు. దరఖాస్తుతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, వయస్సు ధ్రువీకరణకు ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. పల్నాడు జిల్లాలో 1.92 లక్షల మంది వృద్ధులకు ఇప్పటివరకు 12290 కార్డులు మాత్రమే మంజూరయ్యాయి.

ప్రయోజనాలు ఇలా..

- సీనియర్ సిటిజన్ కార్డుతో ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్‌లో 25 శాతం రాయితీ.
- దగ్గర ప్రాంతాల్లో తిరిగే బస్సుల్లో 2 రిజర్వ్ సీట్లు
- రైళ్లల్లో లోయర్ బెర్తల ఎంపికకు ప్రాధాన్యం.



సీనియర్ సిటిజన్ కార్డు

- స్లీపర్ కోచ్‌లో 6, థర్డ్ ఏసీలో 4, సెకండ్ ఏసీలో 3 బెర్తులు రిజర్వ్ చేసుకోవచ్చు.
- నూతన పాస్‌పోర్ట్ కోసం స్లాట్ బుకింగ్ ఫీజులో 10 శాతం రాయితీ.
- ప్రత్యేక క్యూ ద్వారా బ్యాంకుల్లో సేవలు పొందవచ్చు.
- బ్యాంకుల్లో డిపాజిట్లపై అదనపు వడ్డీ లభిస్తుంది.
- ఇన్‌కమ్‌ట్యాక్స్‌లోమినహాయింపు పొందవచ్చు.
- న్యాయస్థానాల్లో కేసుల విచారణ ప్రత్యేక ప్రాధాన్యం. సీనియర్ సిటిజన్స్ లేఖ రాసినా, లేదా వారి తరఫున న్యాయవాది కోరినా ప్రత్యేక విచారణ తేదీలు కేటాయిస్తారు.ఆయా ప్రయోజనాలను దేశవ్యాప్తంగా ఎక్కడైనా నిరాటంకంగా పొందవచ్చు.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్టు

- నిందితుల్లో వైసీపీ సోషల్ మీడియా నేత


కుంచాల సవీంద్రారెడ్డి (ఫైల్)

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో వైసీపీ సోషల్ మీడియా నేత కుంచాల సవీంద్రారెడ్డితో పాటు మరో నలుగురుని అరెస్టు చేసినట్లు ప్రత్తిపాడు పోలీసులు మంగళవారం తెలిపారు. సవీంద్రారెడ్డి వద్ద కిలోన్నర గంజాయి, చిన్నకొండ్రుపాడుకి చెందిన బత్తుల దీవెనబాబు, వెంకటేశ్వర్లు, నాగవేంద్ర, యనమదలకు చెందిన సారధి వద్ద కిలో 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చిన్నకొండ్రుపాడు పొలాల్లో గంజాయి వినియోగంపై అందిన సమాచారంతో సోమవారం పోలీసులు దాడి చేశారు. గంజాయితో ఉన్న బత్తుల దీవెనబాబుతో పాటు గంజాయి తాగుతున్న వెంకటేశ్వర్లు, సారధి, నాగవేంద్ర పోలీసులకు పట్టుబడ్డారు. వారిని విచారించగా చిలకలూరిపేటకు చెందిన జస్వంత్, తాడేపల్లి పరిధిలోని ప్రాతూరు వద్ద కారులో గంజాయి విక్రయించే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు దీవెనబాబు పోలీసులకు చెప్పాడు. దీంతో పోలీసులు ప్రాతూరు వద్దకు వెళ్లగా ఓ కారులోని సవీంద్రారెడ్డిని దీవెనబాబు గుర్తించడంతో అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. కారులో కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకుని సవీంద్రారెడ్డిని ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గానికి చెందిన కుంచాల సవీంద్రారెడ్డి కొద్ది సంవత్సరాలుగా తాడేపల్లిలో నివాసం ఉంటూ బైపాస్ రోడ్డులో హోటల్ డి దేవ్ వద్ద భార్యతో కలిసి చెరుకు రసం స్టాల్ నిర్వహిస్తున్నాడు. చెరుకు రసం స్టాల్ ముసుగులో సవీంద్రారెడ్డి గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు అంటున్నారు.

హైకోర్టులో సవీంద్రారెడ్డి భార్య పిటిషన్

తన భర్తను కారులో వచ్చిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని, ప్రశ్నిస్తే పోలీసులమని చెప్పారంటూ సవీంద్రారెడ్డి భార్య హైకోర్టులో మంగళవారం హెబియస్‌కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే సవీంద్రారెడ్డి విషయం తెలియని పీపీ పోలీసులు అదుపులోకి తీసుకోలేదని హైకోర్టుకు తెలిపారు. సవీంద్రారెడ్డిని బుధవారం ప్రత్తిపాడు పోలీసులు హైకోర్టులో హాజరుపరచనున్నారు. కాగా బత్తుల దీవెన బాబును కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో ఆయనను జిల్లా జైలుకు తరలించారు. ఇదే కేసులో వెంకటేశ్వర్లు, సారధి, నాగవేంద్రలను పోలీసులుస్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

అవీ..ఇవీ..

గ్రామ దేవతలకు సారె సమర్పణ



అమ్మవారికి సారె తీసుకువెళుతున్న మహిళలు

చినగంజాం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామంలో వేంచేసిన గ్రామ దేవతలకు మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో సారెను సమర్పించారు. దసరా పండుగను పురస్కరించుకొని గ్రామంలోని మహిళా భక్తులు తలమీద చీరలు, జాకెట్లు, పసుపు, కుంకుములు, గాజులు, చలిమిడి, పొంగళ్లు, కొబ్బరి కాయలు, అరటి పండ్లు, స్వీట్లును పెట్టుకొని గ్రామంలోని ప్రధాన రహదారులలో మేళతాళాలలో ఊరేగింపుగా వెళ్లి మహాలక్ష్మి, అంకమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు సారె సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సారె ఊరేగింపు కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పరిధిలోని 500 మంది మహిళలు పాల్గొన్నారు. మూడు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

గ్రామగ్రామాన స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పంగులూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని 21 గ్రామ పంచాయితీల పరిధిలో క్యూఆర్ కోడ్‌తో జారీ అయిన స్మార్ట్‌రేషన్ కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. మండలానికి 14,874 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యాయి. ముప్పవరం గ్రామంలోని రెండు రేషన్ షాపుల పరిధిలో మంగళవారం స్మార్ట్‌రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీ.పాలెం పీఏసీఎస్ అధ్యక్షులు అల్లంనేని బ్రహ్మానందస్వామి, నియోజకవర్గ వాణిజ్యవిభాగం అధ్యక్షులు గరిమిడి జగన్మోహనరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మరియదాసు, డీలర్లు ఉదయగిరి శంకర్, రౌతు వీరాంజనేయులు, వీఆర్‌వో సుబ్బారావు, రమ్య పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి వైద్యపరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

అద్దంకి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హేసేవా కార్యక్రమాలలో భాగంగా మంగళవారం మున్సిపల్ సిబ్బంది, కార్మికులు, సచివాలయాల సిబ్బంది 130 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. వైద్యశిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావులు పర్యవేక్షించారు. సీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు డాక్టర్ వాహిళాచౌదరి, డాక్టర్ జయసింహ, డాక్టర్ హేమామాధురి లు వైద్య పరీక్షలు చేశారు.

పీ4 అమలుపై కార్యదర్శులకు శిక్షణ

పంగులూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో పీ4 అమలుపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మంగళవారం పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో మార్గదర్శులకు బంగారుకుటుంబాలకు అనుసంధానం చేసే పద్ధతులను వివరించారు. బంగారు కుటుంబాల అవసరాలు, వాటికి మార్గదర్శుల నుంచి అందించాల్సిన చేయూత, సిబ్బందిపాత్రపై అర్‌పీలకు ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయడంలో సిబ్బంది అప్రమత్తతో వ్యవహరించాలని ఎంపీడీవో స్వరూపారాణి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, అర్‌పీలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయిశ్రీచరణ్

చినగంజాం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మహిళా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం అని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయిశ్రీచరణ్ అన్నారు. 'ఆరోగ్యవంతమైన మహిళ- శక్తిమంతమైన కుటుంబం' కార్యక్రమంలో భాగంగా చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజుబంగారుపాలెం గ్రామ సచివాలయంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బలమైన కుటుంబాల కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వైద్యశిబిరంలో మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము, గర్భాశయ కేన్సర్లకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిబిడ్డలు వయోవృద్ధుల సేవలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి స్ర్కీనింగ్ మానసిక ఆయుష్ సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి భవాని, పీ.హెచ్.సీ. సీ.హెచ్.వో పి.ఝాన్సీరాణి, పీహెచ్ఎన్ కె.స్వర్ణలత, సూపర్‌వైజర్ ఎం.చిరంజీవి, హెల్త్ అసిస్టెంట్ నర్రా మురళి, 104 డీఈవో పొదిలి రాఘవ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై.. కసరత్తు

(5వ పేజీ తరువాయి)

స్థలం కొలతలను ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే పన్ను ఎంతో తెలుస్తుంది. ఈ విధానంలో అక్రమాలు జరగవని భావించినా కొన్ని మున్సిపాల్టీల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి తప్పుడు కొలతలు నమోదు చేశారు. దీంతో పన్ను తక్కువగా నమోదైందని కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. నివాస భవనాన్ని వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగించడం, పన్ను విధించిన సమయంలో ఒక అంతస్తు ఉన్న భవనంపై కట్టడాలు కూడా ఉన్నాయి. పైగా గత వైసీపీ ప్రభుత్వంలో అధికార పలుకుబడితో పలువురు పన్నులను తగ్గించుకున్నారు. ఇలాంటి అక్రమాలపై దృష్టి సారించాలని పురపాలకులను డీఎంఏ ఆదేశించింది. దీంతో ఆ లోపాలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు. అన్ అసైన్డ్.. అండర్ అసైన్డ్ భవనాలను కూడా గుర్తిస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించాలి

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

అద్దంకి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలో విద్యుత్ సరఫరాలో అంతరా యాలను తగ్గించాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి సూచించారు. అద్దంకి డివి జన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో మంగళవారం స్థానిక విద్యుత్‌భవన్‌లో సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన సమీక్ష సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అన్ని విభాగాలను సీఎండీ పుల్లారెడ్డి, డైరెక్టర్(టెక్నికల్) మురళీ కృష్ణ యాదవ్ క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి విలేకర్లతో మాట్లాడారు. అంతరాయం లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరాకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. అవసరమైన మేర కొత్త సబ్‌స్టేషన్లు ఫీడర్లు ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సూర్యఘర్ పథకం ద్వారా శ్లాబు ఉన్న ఇళ్లు ఉన్న ఎస్సీ కాలనీలలోని వినియోగదారుల ఇళ్లపై ఉచితంగా సోలార్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు రాయితీపై సూర్యఘర్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ నాటికి అద్దంకి డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 1500 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామన్నారు. అద్దంకిలో 220/132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు ప్రతి పాదనలు ఉన్నాయన్నారు. సంతమాగు లూరు మండలం ఏల్చూరు వద్ద 132/33 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు అయ్యిందన్నారు. 5 కొత్త సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయన్నారు. వీధి లైట్లు పగటి వేళలో కూడా వెలుగుతుండడాన్ని సీఎండీ దృష్టికి తీసుకురాగా త్వరలో స్పష్టమైన నిర్ణయం తీసుకొని విద్యుత్ వృథా వినియో గాన్ని అరికడతామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన పలు జగనన్న కాలనీలలో ప్రజలు నివాసం ఉండకపోవడంతో ఆయా ప్రాంతాల లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ వైర్లు తొలగించి భద్రపరచనున్నట్లు తెలిపారు. ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, డిఈఈలు దామోదరం, సురేం ద్రబాబు, ఏఈలు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న సీఎండీ పుల్లారెడ్డి

దొంగలు దొరికితేనే కేసు

- 20 మోటార్ సైకిళ్లు రికవరీ.. పోలీసుల అదుపులో నిందితులు
- ఆరు నెలలుగా ఒంగోలు పరిసరాల్లో బైకుల చోరీ
- దొంగిలించిన కేటీఎం మోటార్ సైకిల్‌పై హల్‌చల్

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'సార్ నా బైక్ దొంగిలించారు' అంటూ పోలీసుస్టేషన్‌కు వెళితే అక్కడ నుంచి వచ్చే సమాధానం ఏంటో తెలుసా? 'మీ బైక్ ఎక్కడ దొరికినా మన పోలీసుస్టేషన్‌కు సమాచారం వస్తుంది. దొరికిన వెంటనే మీకు తెలియజేస్తాం. కేసు నమోదు చేస్తే మీ వాహనం వెంటనే ఇవ్వడం కష్టం. కోర్టు ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది' అంటూ పోలీసుల సమాధానం చెప్పి పంపడం పరిపాటిగా మారింది. దీంతో బైక్‌లు పోగొట్టుకున్నావారు పోలీసుస్టేషన్‌ల చుట్టూ తిరగక తప్పడం లేదు.

దొంగిలించిన బైక్‌పైనే దొంగల్ హల్‌చల్

ముగ్గురు యువకులు కేటీఎం బైక్‌ను దొంగిలించి ఆరు నెలలుగా అదే దానిపైనే తిరుగుతూ ఒంగోలుతో పాటుగా పరిసర ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల దొంగతనం చేస్తున్నారు. సీసీఎస్ పోలీసులకు దొరికిన క్లూ ఆధారంగా ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని ఇప్పటికి 20 మోటార్ బైక్‌లు రికవరీ చేశారు. దొంగలను పట్టుకున్న తరువాత బైక్ యజమానులను పిలిపించుకొని ఆయా పోలీసుస్టేషన్‌లలో మూడు రోజులుగా కేసులు నమోదు చేస్తున్నారు. మోటార్ సైకిల్ దొంగతనం జరిగిన రోజు కేసు నమోదు చేసి విచారణ చేపడితే దొంగలు ముందుగా దొరికే అవకాశం ఉండేది. 20 బైక్ చోరీలు జరిగేవి కావు. ఆరు నెలల క్రితం బాపూజీ కాంప్లెక్స్‌లో బైక్ పోయిందని ఫిర్యాదు ఇస్తే అదే సమయంలో సీసీపుటేజీ సక్రమంగా పరిశీలించినట్లు అయితే అప్పుడే దొంగలు దొరికేవారు. ఇప్పుడు దొంగలను పట్టుకున్నది కూడా అదే క్లూతో కావడం గమనార్హం.

కేసు నమోదు చేయకుండా కాలయాపన

మోటార్ బైక్ దొంగతనం జరిగితే కేసులు నమోదు చేయకుండా కాలయాపన చేయడం పోలీసులకు పరిపాటిగా మారింది. ఎక్కడైనా దొంగలు దొరికాక మోటార్ బైక్ రికవరీ చేసిన తరువాత ఆయా పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు చేస్తున్నారు. ఒంగోలు, పరిసర ప్రాంతాల్లోని పోలీసుస్టేషన్‌లలో ఇటీవల నమోదు చేసిన కేసులే ఉదాహరణ. బైక్ పోయిన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టి, సీసీపుటేజీని పరిశీలిస్తే వెంటనే దొంగలు దొరికిపోతారు. కానీ మోటార్ సైకిళ్ల దొంగలను పట్టుకోవడంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడం సర్వత్ర చర్చనీయాశం అయింది.



పొలుట్లలో రోగులను పరిక్షిస్తున్న డాక్టర్

200 మందికి వైద్య పరీక్షలు

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమల అటవీ ప్రాంతమైన పాలుట్లలో డాక్టర్ కోటా నాయక్ ఆధ్వర్యంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్'లో భాగంగా గూడెంలో ఆరోగ్య శిబిరం నిర్వహించి 200 మందికి పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి రాణి, స్టాఫ్‌నర్స్ అరుణ, ల్యాబ్‌టెక్నీషియన్ జానారెడ్డి, డీ జాస్మిన్, త్రివేణి, వెంకట రామయ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం

కొండపి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విక్టోరియారాణి తెలిపారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని చోడవరం, కట్టుబడివారిపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం పోషకాహారాన్ని ప్రదర్శించారు.

మహిళ ఆరోగ్యమే కుటుంబానికి బలం

- డిప్యూటీ డీఎంహెచ్‌వో వాణిశ్రీ

సింగరాయకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం బలంగా ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వాణిశ్రీ అన్నారు. మండలంలోని మూలగుంటపాడు విలేజ్ క్లినిక్‌లో మంగళవారం నిర్వహించిన స్వస్థ్‌నారి-సశక్త్ పరివార్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, పౌష్టికాహార లోపం ఉన్నవారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించారు. తదుపరి సింగరాయకొండ పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు షేక్ అయేషా, ధీరేందర్, వంశీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలి

అడిషనల్ డీపీఎం మోహన్

బల్లికురవ, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): రైతులు తక్కువ ఖర్చుతో సాగయ్యే సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం మోహన్ అన్నారు. మంగళవారం మండలం లోని నక్కబొక్కలపాడు, బల్లికురవ గ్రామాలలో కషాయాల యూనిట్‌ను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎవరైన ప్రకృతి పద్ధతిలో పంటలు సాగు చేయాలంటే వారికి అవసరమైన కషాయాలు అన్ని తక్కువ ధరకు అందు బాటులో ఉన్నాయన్నారు. రైతులు కూడా గ్రామాలలో అందుబాటులో ఉండే వస్తువులతో ఎరువులను తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య, ఏవో శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం రాజారావు పలు గ్రామాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ : పంటల సాగుకు ఇబ్బంది లేకుండా అన్ని గ్రామాలలోని రైతుసేవా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉందని ఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ యూరియాను ప్రభుత్వం రైతుసేవా కేంద్రాలకు పంపుతుందన్నారు. విత్తనశుద్ధి చేసిన తదుపరి పంటలను రైతులు సాగు చేసుకోవాలన్నారు కార్యక్రమంలో టీడీపీ నేతలు దద్దాల అంజయ్య, ఏఈవో మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



బల్లికురవలో కషాయాల తయారీ దుకాణాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పంగులూరు : రైతులు తామసాగు చేసిన పంటల వివరాలు ఈ-క్రాప్‌లో విధిగా నమోదు చేసుకోవాలని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని తూర్పుతక్కెళ్లపాడు, కొప్పెరపాడు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో పంటనష్ట పరిహారం పొందాలన్నా, పండించిన పంటఉత్పత్తులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మద్దతుధరకు అమ్ముకోవాలన్నా ఈ-క్రాప్ నమోదు తప్పనిసరన్నారు.అదేవిధంగా సేంద్రీయ ఎరువుల వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. బర్లీపొగాకు సాగుపై ఉన్న నిషేదాన్ని రైతులు గుర్తించి ప్రత్యామ్నాయ పంటలుగా అపరాలు, మొక్కజొన్న సాగుచేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు గొల్లపూడి అంజయ్య, ఎనికపాటి శ్రీనివాసరావు, వ్యవసాయసహాయకులు ఫిలిప్, రైతులు పాల్గొన్నారు.

వరిలో ఆకుచుట్టు పురుగును నివారించుకోవాలి

అద్దంకిటౌన్ : వరి సాగు చేసిన రైతులు ఆకుచుట్టు పురుగును నివారించుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యా గ్రామాల పరిధిలో సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. పురుగు గుడ్డు దశలో ఉన్నప్పుడు వేప నూనె ఎకరాకు 500 ఎంఎల్ పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతిని బట్టి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 250 గ్రాములు ఎ కరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏలు శేషయ్య, ఖాజాబి, ఆత్మ బ్లాక్ మేనేజర్ శేషారావు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన

మార్టూరు, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): అంగనవాడీ కేంద్రాలు ద్వారా చిన్నారులకు, వారి తల్లులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నామని అంగనవాడీ కార్యకర్త భాగ్యమ్మ అన్నారు. మంగళవారం మార్టూరులో అంబేడ్కర్‌నగర్ లో అంగనవాడీ కార్యకర్తలు మహాపోషణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్యకర్త భాగ్యమ్మ మాట్లాడుతూ ఆరేళ్ల లోపు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను తమ కేంద్రాల ద్వారా అందించడానికి కృషి చేస్తామన్నారు. మరో కేంద్రం కార్యకర్త ఎస్తేరు రాణి మాట్లాడుతూ తల్లులు ఆరోగ్యంగా ఉన్నపుడే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆటలు,పాటలు ద్వారా చిన్నారులకు కేంద్రాలలో చదువును నేర్పించడం జరుగుతుందన్నారు కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్త కోటమ్మ పాల్గొనగా, మద్దిసీతాదేవినగర్ కేంద్రంలో కార్యకర్త పుష్పరాణి ఆధ్వర్యంలో పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



అంబేద్కర్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ నేతలు

చీరాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ సేవాభావంతో రక్తదానం చేయడం వలన సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందని బీజేపీ బాపట్ల పార్లమెంట్ కన్వీనర్ బండారుపల్లి హేమంత్‌కుమార్, రెడ్‌క్రాస్ ఛైర్మన్ బూదరాజు శశికిరణ్ అన్నారు. దేశప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ, చీరాల రెడ్ క్రాస్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు కార్యకర్తలు పాల్గొని రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సమాజానికి మేలుకరమైన సేవలు అందిస్తున్నట్లు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు డా. తాడివలస దేవరాజ్, అబ్దుల్, డా.కుమార్, పూర్ణ, ప్రసాద్, సుబ్బారావు, తేజస్వీ, చంద్ర, జనసేన నాయకులు మామిడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవడంతో పాటు కార్మికులకు 13 గంటల పనిభారాన్ని రద్దు చేయాలని ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీనగర్‌లోని మూడుబొమ్మల సెంటర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎస్‌కే సర్దార్, కే కార్తీక్, దాసరి సంగీతరావు, ఐ.వెంకటేశ్వర్లు, యలమంద, బ్రహ్మాజి, ఏసురత్నం, సుబ్బారావు, రామకృష్ణ ఉన్నారు.

శబరి..బుకింగ్

(5వ పేజీ తరువాయి)

చేసి ఇరుముడులతో అయ్యప్పస్వామిని దర్శించుకొనేందుకు బయలుదేరుతుంటారు. దాదాపుగా ఒక రోజంతా ప్రయాణ సమయం ఉండటంతో ఎక్కువమంది రైళ్లలోనే వెళ్లేందుకు ప్రాధాన్యం కనబరుస్తుంటారు. అయితే గుంటూరు మీదగా శబరిమలకు వెళ్లే ఒకే ఒక్క రైలు శబరి ఎక్స్‌ప్రెస్. ఇది సికింద్రాబాద్‌లో బయలుదేరి ఉమ్మడి గుంటూరు జిల్లాలో నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, నిడుబ్రోలు, బాపట్ల మీదుగా ప్రయాణిస్తుంది. ప్రస్తుతం నంబరు. 17230గా ఉన్న సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29వ తేదీ నుంచి నంబరు. 20629 సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌గా మారబోతున్నది. ఈ కారణంగా టైంటేబుల్‌ని కూడా మార్పు చేశారు. 28వ తేదీ వరకు ప్రస్తుత కాలమానపట్టికలోనే ప్రయాణిస్తుంది. 29వ తేదీ నుంచి మాత్రం సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 2.25కి బయలుదేరి సాయంత్రం 4.59కి నడికుడి, 5.19కి పిడుగురాళ్ల, 5.49కి సత్తెనపల్లి, 6.35కి గుంటూరు, రాత్రి 7.33కి తెనాలి, 7.53కి నిడుబ్రోలు, 8.13కి బాపట్ల, 8.28కి చీరాల, మరుసటి రోజు మధ్యాహ్నం 2.12కి కొట్టాయం, 2.55కి చెంగనూరు, సాయంత్రం 6.20కి తిరువనంతపురం చేరుకొంటుంది.

అయ్యప్ప భక్తులు ఇరుముడులు కట్టించుకొని మధ్యాహ్నం భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకొని ఈ రైలులో బయలుదేరే విధంగా టైంటేబుల్ ఉండటంతో ఇందులో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. విజయవాడ మీదగా శబరిమలకు వెళ్లే రైళ్లు ఉన్నప్పటికీ అవి దూర ప్రాంతాల నుంచి వచ్చేవి. ప్రస్తుతం తత్కాల్ కోటా టిక్కెట్‌లు ఎలాగైతే హాట్‌కేక్‌లు మాదిరిగా బుకింగ్ అయిపోతాయో శబరి ఎక్స్‌ప్రెస్‌కి ఏ రోజుకు ఆ రోజు ఉదయం 8 గంటలకు బుకింగ్ ఇలా తెరవగానే అలా అయిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రద్దీ రోజులను బట్టి టీవోడీ(ట్రైన్ ఆన్ డిమాండ్)లను శబరిమలకు నడపాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

137 మంది మహిళలకు వైద్యపరీక్షలు

కొండపి : స్వస్థ్‌నారీ-సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా కె.ఉప్పలపాడు గ్రామంలో మంగళవారం 137 మంది మహిళలకు పరీక్షలు చేశారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పెట్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక, టీడీపీ గ్రామ నాయకుడు గుండపనేని రామ్మూర్తి నాయుడు, వైద్యారోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా జాలమ్మతల్లి

సింగరాయకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలోని జాలమ్మతల్లి దేవస్థానంలో శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజైన మంగళవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దాసరి యానాదిరావు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా పోలేరమ్మ

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రుల్లో రెండో రోజైన మంగళవారం కామేపల్లిలోని పోలేరమ్మ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో బైరాగి చౌదరి పర్యవేక్షించారు.

నేడు క్వారీ ఓనర్లకు అవగాహన సదస్సు

చీమకుర్తి,సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : సీనరేజి వసూళ్ల ప్రక్రియను ప్రైవేటీకరణ చేసిన నేపథ్యంలో గెలాక్సీ గ్రానైట్ ఓనర్లకు బుధవారం గనులశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. సీనరేజి వసూళ్ల అధికారం పొందిన ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు, మైన్స్ శాఖాధికారులు పాల్గొననున్నారు.

పురుగు మందుల దుకాణాలలో తనిఖీలు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎరువులు, పురుగుమందులు దుకాణాలలో మంగళవారం పోలీసు తనిఖీలు నిర్వహించారు. నిల్వలను పోలీసులు పరిశీలించారు. రికార్డులు తనిఖీలు చేశారు. ఒంగోలు బండ్లమిట్టలోని ఎరువులు దుకాణంలో సీఐ మేడా శ్రీనివాసరావు తనిఖీ చేశారు. అదే విధంగా కొత్తపట్నం మండలంలో కూడా ఎరువులు దుకాణాలు తనిఖీ చేసి యూరియ నిల్వల గురించి వాకబు చేశారు.

గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు

● వివిధ ఆలయాల్లో కొనసాగుతున్న శరన్నవరాత్రులు ● ఆకట్టుకుంటున్న అమ్మవారి అలంకరణలు

పర్చూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం శ్రీ గాయత్రీదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్థానిక అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అత్యంత వేడుకగా జరుపుతున్నారు. అదేవిధంగా పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీ త్రివిక్రమ అగస్తేశ్వర స్వామివారి ఆలయంలో విశిష్ట పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే నాగులపాలెం, నూతలపాడు, ఉప్పుటూరు, అన్నంబొట్లంవారిపాలెం గ్రామాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో దసరా శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు.

రెండోరోజు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మార్టూరు :దసరా శరన్నవరాత్రి ఉత్సవాలులో భాగంగా రెండవ రోజు మంగళవారం అమ్మ వారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మార్టూరులోని దుర్గామల్లేశ్వరి దేవస్థానం, నాగరాజుపల్లి గ్రామంలో శ్రీగంగా పార్వతీ సమేత నాగలింగేశ్వర స్వామి దేవస్థానంలో గాయత్రీదేవి అవతరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మ వారిని వివిధ రకాలు పూలదండలతో అలంకరించారు. అదేవిదంగా మార్టూరులో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మ వారిని శ్రీబాలత్రిపురసుందరి అవతారంలో, మండలంలోని ద్రోణాదుల గ్రామంలో అంకాళ పరమేశ్వరి దేవాలయంలో శ్రీలలిత త్రిపురసుందరిదేవి అవతారంలో అలంకరించారు. మార్టూరులోని బొడ్డరాయి కూడలిలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని సర్వాంగసుందరంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు. రాత్రి సమయంలో భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

చినగంజాం : మండలంలోని పలు దేవాలయాలలో దసరా పండుగను పురస్కరించుకుని దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తలకు దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్థానిక రైల్వే సెంటర్ భవానీపురంలోని విజయకనకదుర్గాభవాని దేవస్థానంలోని అమ్మవారిని, చినగంజాం వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలోని అమ్మవారిని గాయత్రీదేవి అలంకారంలో, సోపిరాల రామకోటేశ్వరస్వామి దేవ స్థానంలో లలితాపరమేశ్వరి అమ్మవారిని పంచముఖ గాయత్రీదేవి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శ నం కల్పించారు. స్థానిక భూ సమేత భావనారాయణస్వామి ఆలయంలో 18వ వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా మంగళవారం ఉదయం అగ్నిప్రతిష్ఠాపన, నిత్యహోమం నిర్వహించారు. అనంతరం ఆలయప్రాంగణంలో మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రికి గ్రామోత్సవంలో శేషవాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చినగంజాంలోని రామకోటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అద్దంకి : దసరా శరన్నవరాత్రులలో భాగంగా మంగళవారం స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారు భువనేశ్వరిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఈశ్వరబహదూర్ బృందంతో ఆలపించిన గీతాలు, సంగీతం, నృత్యప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. దేవస్థానం అధ్యక్షుడు ఊటుకూరి రామకోటేశ్వరరావు, చిన్ని లక్ష్మిశ్రీనివాసరావు, అర్వపల్లి హనుమంతరావు, పోకూరి శ్రీనివాసరావు, నేరేళ్ల శ్రీనివాసరావు, పూజారి స్వర్ణ వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. పట్టణంలోని దత్తపాదుకాక్షేత్రం, వేయిస్థంభాల గుడి తదితర దేవాలయాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

విశేషంగా శరన్నవరాత్రులు

పంగులూరు : మండలంలోని పలు ఆలయాలలో శ్రీదేవీ శరన్నవరాత్రి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గాయత్రిదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. ముప్పవరంలోని శ్రీలక్ష్మీ గణపతిషిర్డీసాయి ఆలయంలో గణపతిపూజ, నవావర్ణపూజ, స్వామివారికి రుద్రాభిషేకం, సూక్తహోమములు నిర్వహించారు. సాయంత్రం శ్రీచక్ర నవావర్ణపూజ, సహస్రనామము, కుంకుమార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముప్పవరం, కొండమూరు, రామకూరు గ్రామాలలో గాయత్రిదేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలుచేశారు. పంగులూరు, చందలూరు తదితర గ్రామాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలుచేశారు.



నాగరాజుపల్లిలో గాయత్రీదేవిగా, ద్రోణాదులలో లలిత త్రిపుర సుందరిగా అమ్మవారు, అద్దంకిలో భువనేశ్వరి దేవిగా కన్యకా పరమేశ్వరి, ముప్పవరంలో అమ్మవారి గాయత్రీ దేవి అలంకరణ, పర్చూరులో అద్దంకి నాంచారమ్మ అలంకరణ

అద్దంకిటౌన్ హాల్ నిర్మాణానికి సన్నాహాలు

రూ.3.30 కోట్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన అదానీ సంస్థ

అద్దంకి, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో టౌన్ హాల్ నిర్మించేందుకు అదానీ సంస్థ ముందుకు వచ్చింది. పట్టణంలోని భవానిసెంటర్‌లో 16 సెంట్ల స్థలంలో అద్దంకి టౌన్‌హాల్ నిర్మాణం చేయాలని పలువురు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకు పోయారు. ఈ నేపథ్యంలో రెండు అంతస్తులతో రూ.3.30 కోట్లతో ఆదాని సంస్థ సామాజిక బాధ్యతగా టౌన్‌హాల్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆదాని సంస్థల ప్రతినిధులు స్థల పరిశీలన చేశారు. అద్దంకి టౌన్ హాల్ నిర్మాణానికి రూ.3.30 కోట్లు మంజూరు చేసేందుకు ఆ సంస్థ ఉన్నత స్థాయి అధికారులు అంగీకరించిన ట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో పనులు కూడా ప్రారంభం కానున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో ముందు వైపు పార్కింగ్‌కు వదిలి, డైనింగ్‌హాల్ నిర్మాణం చేయనున్నారు. మొదటి అంతస్తు లో 180 మంది కూర్చొనే విధంగా సీటింగ్ తో హాల్ నిర్మాణం చేయనున్నారు. నిర్మాణం పూర్తయిన తరువాత అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించే విధంగా ఏర్పాటు చేయనున్నారు. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు తక్కువ ఖర్చుతో వేడుకలు చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. ఎన్నో ఏళ్ళు గా ఎదురు చూస్తున్న అద్దంకి టౌన్ హాల్ నిర్మాణం ఎట్టకేలకు నెరవేరనుంది.



పట్టణంలోని భవానీ సెంటర్‌లో టౌన్‌హాల్ నిర్మించనున్న స్థలం

ఆర్‌వోబీ వంతెన సమస్యపై ఎమ్మెల్యే గళం

● అసెంబ్లీలో ప్రస్తావించిన కొండయ్య

చీరాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కొండయ్య అసెంబ్లీ సమావేశాల్లో గళం వినిపించారు. చీరాల అగ్నిప్రమాద కేంద్రం సమీపంలోని ఏర్పాటు చేయనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌వోబీ) వంతెన ఇటీవల అనివార్య కారణాలతో రద్దయ్యింది. అయితే దీనిపై అసెంబ్లీ లో ఎమ్మెల్యే స్పందించి మాట్లాడారు. గతంలో 1999 సంవత్సరంలో దగ్గుబాటి రామానాయుడు ఎంపీగా ఉన్నప్పుడు పర్చూరు వైపు ఒక ఆర్‌వోబీ ఏర్పడిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. అయితే తాజాగా మరో వంతెన ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే మంజూరైన ఈ వంతెన రద్దు కావడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో దాదాపుగా రెండు లక్షల మంది ప్రజలు రాకపోకలకు నిత్యం ఇబ్బంది పడుతున్న విషయాన్ని సభకు వివరించారు. వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

ఇంకొల్లులో డ్రోన్ పైలెట్ శిక్షణ కేంద్రం

ఇంకొల్లు, సెప్టెంబరు 23,(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పౌరవిమానశాఖ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా ఇంకొల్లులో డ్రోన్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడాకి అనుమతి లభించినట్లు మారుతీ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కారుమూడి శ్రీనివాసరావు తెలిపారు. ఇంకొల్లు మారుతీ ఐటీఐ, డ్రోన్ లాబ్ టెక్నాలజీస్ ప్రై లిమిటెడ్, అహ్మదాబాద్ వారు సంయుక్తంగా ఈ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ శిక్షణా కేంద్రంలో డ్రోన్ ఆపరేట్ చేయడం, నిర్వాహణ గురించి శిక్షణ ఇచ్చి పరీక్ష అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ వారు రిక్రూట్ పైలెట్ లైసెన్స్‌ను మంజూరు చేస్తారని శ్రీనివాసరావు తెలిపారు. రైతులు, సివిల్ ఇంజనీర్లు, మైనింగు ఇంజనీర్లు, డ్రోన్ ద్వారా ఉపాధి పొందాలనుకొనే యువత డ్రోన్ ఆపరేట్ చేయడానికి ఈ శిక్షణకు అందిపుచ్చుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు గ్రామీణ ప్రాంతంలో అధునాతన టెక్నాలజిని అందిపుచ్చుకోవడానికి ఈ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ఇటువంటివి 3 శిక్షణా కేంద్రాలు ఉన్నాయని 4వ కేంద్రం ఇంకొల్లులో ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు పొందినట్లు తెలిపారు. ఈ శిక్షణా కేంద్రాన్ని ఈ నెల 29న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రోటరీ క్లబ్ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం

ఇంకొల్లు,సెప్టెంబరు 23,(ఆంధ్రజ్యోతి) : స్థానిక రోటరీ గంగలో ఇంకొల్లు రోటరీ క్లబ్‌లో నూతనంగా చేరిన సభ్యులతో మంగళవారం రాత్రి రోటరీ అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన రొటేరియన్, మాజీ ఎంపీపీ మద్దినేని హనుమంతరావు చిత్రపటానికి పూలమాలతో నివాళ్లులర్పించారు. అనంతరం రోటరీక్లబ్ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు అధ్యక్షతన నూతనంగా క్లబ్‌లో చేరిన డాక్టర్ పుసులూరి మురళీకృష్ణ, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, పెరికాల నాగరాజులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అలవల రాఘవరెడ్డి, ట్రెజరర్ గోరంట్ల నాగేశ్వరావు, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో రెవెన్యూ ఉద్యోగులకు ఆటవిడుపు

రెవెన్యూ క్రీడా కరపత్రాలు ఆవిష్కరించిన ఆర్డీవో

చీరాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజాసేవలో ఉండే రెవెన్యూ ఉద్యోగులకు ఆటలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు అక్టోబరు 10, 11 తేదీలలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం తహసీల్దార్ గోపీకృష్ణతో కలిసి ఆర్డీవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సీహెచ్ సురేష్, డివిజన్ కార్యదర్శి పి.సురేష్, క్రీడల కార్యదర్శి అర్జున్, సత్యనారాయణ, శ్రీనివాసులు, ఆదినారాయణ, తేజ, రమేష్, నారాయణమ్మ, కృష్ణవేణి, వీఆర్వోలు, వీఆర్ఏ లు పాల్గొన్నారు.



క్రీడాకరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

ఆర్డీవోను కలిసిన తహసీల్దార్

వేటపాలెం(చీరాల) : చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడును వేటపాలెం తహసీల్దార్ గీతారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. సివిల్ సప్లయి డీటీగా పనిచేసిన ఆమె ఉద్యోగోన్నతిలో భాగంగా ఉన్నతాధికారులు వేటపాలెం తహసీల్దార్‌గా నియమించారు. ఈక్రమంలో మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆమె ఆర్డీవోను కలిశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకతతో పనిచేయాలని ఆర్డీవో సూచించారు.

రోడ్డు అంచులో బోల్తాపడ్డ గ్యాస్ ట్యాంకర్

భారీ ఎక్స్‌కవేటర్‌తో నామ్ రోడ్డు పైకి చేర్చిన వైనం

అద్దంకి,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): రోడ్డుఅంచులో గ్యాస్ ట్యాంకర్ బోల్తాపడిన ఘటన అద్దంకి సాధునగర్ సమీపంలో నామ్‌రోడ్డు వెంబడి శ్రీనివాసనగర్ వద్ద చోటుచేసుకొంది. చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళుతుండగా ప్రమాదం చోటుచేసు కొంది. దీన్ని ప్రత్యేకంగా తెప్పించిన భారీ ఎక్స్‌కవేటర్ సహాయంతో మంగళవారం సాయంత్రానికి రోడ్డుపైకి తీసుకొచ్చారు. మండే స్వభావం ఉన్న గ్యాస్ ట్యాంకర్ కావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



బోల్తా పడ్డ గ్యాస్ ట్యాంకర్‌ను లేపుతున్న ఎక్స్‌కవేటర్

సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు

● నిందితుడికి పోలీసుల నోటీసులు

అద్దంకి,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియాలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లతో పాటు బీఆర్.నాయుడిపై వ్యంగ్యంగా పోస్టులు పెట్టిన ఘటనపై గతంలో అద్దంకిలో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో పోస్టులు పెట్టిన తాటికొండ మండలం కంతేరుకు చెందిన కల్లం హరికృష్ణారెడ్డికి మంగళవారం 41 నోటీసు అందజేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులతో పాటు ఎవరిపైనైనా సోషల్ మీడియా లో వ్యంగంగా పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని సీఐ సుబ్బరాజు తెలిపారు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మొక్కుతీర్చుకొని వస్తుండగా ప్రమాదం

● లారీ - ఆటో ఢీకొని తొమ్మిది మందికి గాయాలు

బల్లికురవ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చేపపిల్లలతో వస్తున్న లారీ, ట్రాలీ ఆటో ఢీ కొని 9 మందికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి మండలం చినకొత్తపల్లికి చెందిన ఓ కుటుంబం పల్నాడు జిల్లా అడిగొప్పులలో మొక్కుతీర్చు కొనేందుకు ఆటోలో బంధువులతో కలిసి వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు చెరువు వద్ద మంగళవారం సాయంత్రం ముందు చేపపిల్లలతో వెళ్తున్న లారీ, వెనుక ప్రయాణికులతో వస్తున్న ట్రాలీ ఆటో ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో చింతంరెడ్డి జయరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రభాకరరెడ్డి, అంజిరెడ్డి, పేరమ్మ, మాగంటి రామాంజనేయులు, మిరియాల సీతారామయ్యలతో పాటు ఆటోడ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు.



ప్రమదానికి గురైన వాహనం

టీడీపీ అనుబంధ సంఘాల ఏర్పాటుపై అభిప్రాయ సేకరణ

అద్దంకి, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అద్దంకి మండల శాఖ, అనుబంధ సంఘాల నియామకానికి సంబంధించి మండల నేతలు మంగళవారం స్థానిక కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల కమిటీ, అనుబంధ సంఘాలలో ఉత్సాహంగా పనిచేసే నాయకుల పేర్లను ఆయా గ్రామాల నేతల నుంచి సేకరించారు. సమావేశంలో టీడీపీ మండల నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, మానం మురళీ మోహన్‌దాస్, పెంట్యాల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించండి

మార్టూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) మండలంలోని డేగరమూడి గ్రామంలో డాక్టరు బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని మంగళవారం దళిత సంఘాల నాయకులు సీఐ ఎం.శేషగిరిరావు, ఎంపీడీవో రాంబాబులకు వినతిపత్రం అందజేశారు. దీంతో వారికి సహకరిస్తామని సీఐ శేషగిరిరావు దళిత నాయకులకు తెలిపారు. అధికారులకు వినతిపత్రం అందచేసిన వారిలో దళిత నాయకులు జెట్టి ఖాజావలి, సుబ్బారావు, బి బెంజిమెన్, సాతులూరి ఉదయభాస్కర్, రోశయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


హెచ్‌ఐవీని నిర్మూలిద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకిటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు లేని సమాజాన్ని, మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని రూపొందించడంలో గ్రామస్థాయి నుంచి అందరూ కలిసిరావాలని, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. మంగళవారం అద్దంకి మున్సిపల్ కార్యాలయం వద్ద, మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ వాహిల చౌదరి, డాక్టర్ గొట్టిపాటి జయసింహ, సర్పంచ్ పద్మావతి, సీహెచ్‌వో పద్మజ, ప్రోగ్రాం మేనేజర్ దుర్గా, సురేంద్ర, దుర్గా భవాని, పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులను అందజేస్తున్న రోటరీ సభ్యులు

మార్టూరు, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో రోటరీ మాజీ అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు తన మనుమరాలు ఇషిర జన్మదినం సందర్భంగా పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. మండలంలోని 10 గ్రామాలకు చెందిన 45 మంది పారిశుధ్య కార్మికులకు సాంబశివరావు నూతన దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు మాదాల సాంబశివరావు, ఇంటూరి ఆంజనేయులు, తాటి నాగేశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

సముద్రపు నాచు పెంపకంపై శిక్షణ



సముద్రపు నాచు పెంపకంపై మత్స్యకారులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

చినగంజాం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : సముద్ర నాచు పెంపకం ద్వారా తీరప్రాంత మత్స్యకారుల స్థితిగతుల మార్పు, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని జిల్లా మత్స్యశాఖ అధికారి కే.శ్రీనివాస్‌నాయక్ అన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలోని గ్రామ సచివాలయం-2లో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఫిషర్‌మెన్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ వారి సహకారంతో సముద్ర నాచు పెంపకంపై మంగళవారం మత్స్యకారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సముద్ర నాచుపెంపకం చేపట్టడానికి ఆసక్తి ఉన్న మత్స్యకారులను, మత్స్యకార మహిళలను ఎంపిక చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఏపీఎం గద్దె పెదసుబ్బారావుకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో పల్లెపాలెం గ్రామానికి చెందిన 60 మంది మత్స్యకారులకు గ్రసముద్ర నాచు ఉత్పత్తి, వాటి వినియోగం, వివిధ రకాల సముద్ర నాచు పెంపక పద్ధతులు, కొనుగోలు ప్రక్రియ, విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణా కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. మత్స్యకారులకు ఏటిమొగ సముద్రతీరం వద్ద సముద్ర నాచు పెంపకం ఎలా చేపట్టాలో పర్యావరణ తరంగ మేనేజింగ్ డైరెక్టర్ మాధవి ప్రదర్శన చేసి చూపించారు. కార్యక్రమంలో భావదేవరపల్లి ఎంవీకేఆర్ మత్స్యపాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.అనుపమ, జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి.కృష్ణకిషోర్, కారంచేడు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం.రవీంద్ర, ఎఫ్‌డీవో కిషోర్‌రెడ్డి, సాగరమిత్రులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు అవగాహన



ఏలూరులో పర్యటించిన రైతులతో ఉద్యాన అధికారి

మార్టూరు, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆసక్తి గలిగిన రైతులను అధికారులు ఒక రోజు పర్యటనకు తీసుకువెళ్లారు. ఉద్యానశాఖ అధికారి బి హనుమంతనాయక్ ఆధ్వర్యంలో రైతులను ఏలూరు సమీపంలోని పెదవేగి గ్రామంలో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పాం రీసర్చ్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అనంతరం అక్కడ విజయ్‌రాయ్ అనే గ్రామంలో ఉన్న ఉద్యాన పరిశోధనా స్థానంలో ఆయిల్‌ఫామ్ సాగుకు సంబందించిన వివరాలను ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టరు సుశీల, డాక్టరు మాధవీలతలు రైతులకు వివరించారు. తరువాత దిబ్బగూడెం గ్రామంలో ఆయిల్‌ఫామ్,వక్క, పసుపు తోటలను రైతులు సందర్శించారు. వీటి సాగుపై వాటి యజమాని ఉప్పలపాటి చక్రపాణి రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమానికి మండలంలోని బొబ్బేపల్లి, ద్రోణాదుల, నాగరాజుపల్లి, కోలలపూడి, వలపర్ల గ్రామాలకు చెందిన రైతులు తరలివెళ్లారు.

స్వర్ణకారుడిపై కేసు నమోదు

● బంగారం వస్తువులు చేస్తానని రూ.30 లక్షలకు టోకరా

ఈపూరుపాలెం(చీరాల), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బంగారు వస్తువులు చేసిస్తానని పలువురిని మభ్యపెట్టి ఈపూరుపాలెంకు చెందిన స్వర్ణకారుడు బూదాటి మల్లికార్జునరావు సుమారు రూ.30 లక్షలు నగదుతో ఉడాయించాడు. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.., గ్రామానికి చెందిన ఆయన కొంత కొంతకాలంగా విడతల వారీగా ప్రజల నుండి నగదు వసూలు చేశాడు. అయితే రోజులు గడుస్తున్నా తిరిగి నగదు కానీ, వస్తువులు కానీ ఇవ్వకపోడంతో ప్రజలు అతడిని నిలదీస్తూ వచ్చారు. అకస్మాత్తుగా అతను ఇంటి నుండి పరారయ్యాడు. మోసపోయినట్లు తెలుసుకున్నా బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే బాధితుల సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉందని పోలీసులు భావిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలకు సీలింగ్ ఫ్యాన్లు వితరణ



కళాశాలకు ఫ్యాన్‌లు అందిస్తున్న దాతలు

చీరాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు విశ్రాంత బ్యాంకు మేనేజర్ కేవీ శేషబాబు నాలుగు సీలింగ్ ఫ్యాన్‌లు అందజేశారు. ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి తనవంతు సహకరిస్తానని ఆయన చెప్పారు. ప్రిన్సిపల్ డా.ఎన్ మురళీ మాట్లాడుతూ విద్యాలయాలకు సహకారం అందించడం ఆనందదాయకమన్నారు. శేషబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఆయుర్వేద మొక్కలను పరిరక్షించండి



ఔషధమొక్కలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ తిరుపతమ్మగోపి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదం ప్రాముఖ్యతను ప్రజలు తెలుసుకోవాలని 4వ వార్డు కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ అన్నారు. మంగళవారం ఇండియా ఎంపవర్మెంట్ అండ్ ఎడ్యూకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని 4వ వార్డులో ఆయుర్వేద దినోత్సవం 2025 సందర్భంగా ఆయుర్వేదంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు యాలకులు, తులసి, ఇన్సులిన్ ప్లాట్, అశ్వగంధ, రణపాల, కరివేపాకు, తమలపాకు, రోజుమేరీ, మరువం, మల్లె, తిప్పతీగ వంటి పలు రకాల మొక్కలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ అశోక్, ఐఈఈఆర్‌డీ ప్రెసిడెంట్ బత్తుల కిరణ్‌చంద్, వాణిశ్రీ, సుధారాణి, మునీప్, ధనలక్ష్మి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'మహిళాశక్తి'తో ఆర్టీసీకి రికార్డు ఆదాయం

● ఒక్కరోజులో రూ.15.43 లక్షల ఆదాయం

అద్దంకి,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): అద్దంకి ఆర్టీసీకి మరోసారి రికార్డు స్థాయి ఆదాయం వచ్చింది. సోమవారం అద్దంకి డిపోకు చెందిన 64 బస్సుల ద్వారా రూ.15,43,027 ఆదాయం వచ్చినట్లు అసిస్టెంట్ డీఎం మహబూబి తెలిపారు. మహిళాశక్తి పథకం అమలు ప్రారంభించినప్పటి నుంచి సోమవారం వరకు 6 రోజులలో 100 శాతం ఓఆర్ వచ్చినట్లు తెలిపారు. సోమవారం 105 శాతం ఓఆర్ వచ్చినట్లు తెలిపారు.